PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 263 | విజయవాడ, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 28 April 2024 | Rs

సిటీ◆

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నేతల ఆందోళన
- ఇండియా అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- బాబూరావుకు మద్దతుగా సింగ్‌నగర్‌లో రోడ్ షో

2

చరిత్ర సృష్టించిన భారత ఆర్చర్లు

- ప్రపంచకప్ ఆర్చరీలో హ్యాట్రిక్ స్వర్ణాలు

8

నైనిటాల్ సమీపాన అటవీ ప్రాంతంలో అంతకంతకూ విస్తరిస్తున్న దావానలం..
బాంబి బకెట్ ద్వారా మంటలను ఆర్పేందుకు ఎంఐ - వి 5 హెలికాప్టర్లను రంగంలోకి దింపిన వాయుసేన

నైనిటాల్ అడవుల్లో దావానలం!

- 60 గంటలుగా కార్చిచ్చు
- బూడిదగా 260 ఎకరాలు మారిన అడవులు
- రంగంలోకి దిగిన సైన్యం

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ అడవుల్లో దావానలం చెలరేగింది. గత 60గంటలుగా సాగుతున్న ఈ కార్చిచ్చుతో ఇప్పటివరకు రాష్ట్రంలో పలుచోట్ల 260 ఎకరాల మేర అటవీ భూములు తగలబడ్డాయి. నైనిటాల్ జిల్లా ప్రధాన కేంద్రానికి సమీపంలో మంటలు చెలరేగడంతో ఆ పక్కనే గల హైకోర్టు కాలనీ ప్రాంత ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో ఇరుక్కున్నారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సైన్యాన్ని, అటవీశాఖ సిబ్బందిని రంగంలోకి దింపింది. ఆర్మీకి చెందిన ఎంఐ 17 హెలికాప్టర్లు భీమ్‌టాల్ సరస్సు నుండి నీటిని తీసుకొచ్చి అటవీ ప్రాంతాలపై జల్లి మంటల ఉధృతిని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. చాలావరకు మంటలను అదుపు చేయగలిగినట్లు అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు 23 జరిగాయన్నారు. నందా రేంజ్‌లో ఈ వారం ప్రారంభంలో మొదటగా మంటలు చెలరేగాయని, ఆ తర్వాత దిగువ ప్రాంతాలకు వ్యాపించి ఐఎఫ్ స్థావరం వరకు చేరుకున్నాయని నైనిటాల్ జిల్లా అటవీ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. నగరానికి పది కిలోమీటర్ల దూరంలోనే ఈ మంటలు చెలరేగాయని చెప్పారు. కార్చిచ్చు కారణంగా నల్లని దట్టమైన పొగతో నైనిటాల్, సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో ఇక్కడకు వచ్చిన పర్యాటకులు కూడా తాజా పరిస్థితులతో తీవ్ర నిరాశకు గురయ్యారు.

ముఖ్యమంత్రి పుష్కర్ దామి అత్యవసర సమావేశం నిర్వహించి, పరిస్థితులను సమీక్షించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు ఏరియల్ సర్వే జరిపారు. ఈ మంటలు ఎలా ప్రారంభమయ్యాయో, ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా పాల్పడ్డారా అనేది దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అడవుల్లో చెలరేగే ఈ మంటలను అదుపు చేయడం పెద్ద సవాలుగా వుంటుందని వ్యాఖ్యానించారు. రుద్రప్రయాగ్‌లో శుక్రవారం ఇందుకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

సంక్షేమం కొనసాగిస్తాం

- వైసిపి మ్యానిఫెస్టో విడుదల చేసిన జగన్మోహన్‌రెడ్డి
- ప్రత్యేక హోదా కోసం కృషి
- వచ్చే ఐదేళ్లలో పోలవరం పూర్తి
- వైఎస్ఆర్ చేయూత రూ.1.50 లక్షలకు పెంపు

విశాఖ నుండి పాలన



ఎన్నికల ప్రణాళిక విడుదల సందర్భంగా మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఐదేళ్ల కాలంలోనూ సంక్షేమాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన వైసిపి మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఒక్కో పథకం, దాని లక్ష్యాలను వివరించారు. గత మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, రానున్న ఐదేళ్ల కాలంలోనూ అదే స్ఫూర్తితో పనిచేస్తామని ఎప్పారు. రానున్న ఐదేళ్ల కాలంలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. విశాఖను పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేస్తామని అదే విధంగా అమరావతిని శాసన రాజధానిగానూ, కర్నూలును న్యాయ రాజధానులుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. భూముల రీసర్వే చేస్తామని వివరించారు. వైఎస్ఆర్ చేయూతను రూ.1.50 లక్షలకు, జగనన్న అమ్మఒడి రూ.17 వేలకు పెంచుతామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పదిలక్షల ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏటా ఇస్తున్న రూ.13,500 రైతు భరోసాను రూ.16 వేలకు పెంచుతామని, ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తామన్నారు. 25 వేలు జీతం పొందే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా నవరత్నాలు అమలు చేస్తామని హామీనిచ్చారు. ప్రాధాన్యతాక్రమంలో జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మధ్య తరగతి ప్రజల కోసం గృహ నిర్మాణం కింద వచ్చే ఐదేళ్లలో ఏడాదికి రూ.1000 కోట్లు ఇస్తూ రూ.2000 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. సున్నావడ్డీ పథకాన్ని, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా ఇస్తామని, పెళ్లికి రాయితీలు పొందాలంటే పదోతగరతి ఖచ్చితంగా చదవాలని పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద వచ్చే ఐదేళ్లలో ఏడు విడతల కింద రూ.1.05 లక్షల వరకూ రుణం అందిస్తామని చెప్పారు. వచ్చే ఐదేళ్ల పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటివద్దే మిగతా 2లో

ఎట్టకేలకు 5 బిల్లులకు కేరళ గవర్నర్ ఆమోదం

తిరువనంతపురం : కేరళ అసెంబ్లీ ఆమోదించిన ఐదు బిల్లులపై గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్ ఎట్టకేలకు సంతకం చేశారు. ఏళ్ల తరబడి బిల్లులను ఆమోదించకుండా, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న గవర్నర్ తీరుపై రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం, కేరళ గవర్నరు తీరుపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిన తరువాత బిల్లుల్లో కదలిక వచ్చింది. సభ ఆమోదించిన బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నరుకు లేదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ల్యాండ్ అసైన్‌మెంట్ సవరణ బిల్లు, వరి పండించే ప్రాంతం, మెట్ట ప్రాంతాల పరిరక్షణ బిల్లు, సహకార సంఘాల సవరణ బిల్లు, సహకార చట్టం సవరణ బిల్లు, అబ్కారీ చట్ట సవరణ బిల్లులపై సంతకం చేశారు. గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ తాను కొన్ని రోజుల క్రితం ఐదు బిల్లులపై సంతకాలు చేశానని చెప్పారు. బిల్లులను పరిశీలించి ఆమోదించాలని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ నిర్ణయంతో సుప్రీంకోర్టు ఆదేశాలకు సంబంధం లేదన్నారు.

పాడేరు సభలో మాట్లాడుతున్న షర్మిల, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, పాడేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శతక బుల్లిబాబు తదితరులు

బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం

- వారిలో ఎవరికి అధికారం ఇచ్చినా మోడీకి గులాంగిరి చేస్తారు
- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి : వైఎస్ షర్మిల
- ఆదివాసీలపై కుట్రలు చేస్తున్న వారిని ఓడించాలి: వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పాడేరు, అరకులోయ విలేకరులు, అనకాపల్లి ప్రతినిధి

ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోన్న బిజెపికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలైన వైసిపి, టిడిపిలు ఊడిగం చేస్తున్నాయని, జగన్, చంద్రబాబులు మోడీకి లొంగిపోయారని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. ఆమె చేపట్టిన ఎపి న్యాయ్ యాత్రలో భాగంగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, అల్లూరి జిల్లా పాడేరు, అరకులోయల్లో శనివారం బహిరంగ సభల్లో ఆమె ప్రసంగించారు. చంద్రబాబు, జగన్‌ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఆంధ్ర రాష్ట్రం పాలిట నియంతలుగా మారిన జగన్, చంద్రబాబులకు మళ్లీ అధికారం ఇస్తే మోడీకి గులాంగిరి చేస్తారని, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో వారు విఫలమయ్యారని వివరించారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉందన్నారు. జగన్ మూడు రాజధానులంటూ ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారని వివరించారు. మద్యపాన నిషేధం అమలు చేయలేకపోయారని, దగా డిఎస్‌సితో యువతను మోసగించారని విమర్శించారు. చంద్రబాబు, జగన్‌ల పదేళ్ల పాలనలో పది కొత్త పరిశ్రమలైనా రాలేదన్నారు. మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలన్న ఇంగితం కూడా వారికి కరువైందని మండిపడ్డారు. ఇండియా వేదిక ప్రభుత్వం అధికారంలోకొస్తే గిరిజనులకు గృహ నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు పెంపొందిస్తుందని హామీ ఇచ్చారు. గిరిజన హక్కుల సాధన, గిరిజనుల అభివృద్ధి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కృషి చేస్తుందన్నారు. ఆదివాసీ హక్కులను, రిజర్వేషన్లను నిర్వీర్యం చేస్తోన్న బిజెపి, వైసిపి, టిడిపిలను ఓడించాలని కోరారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, వామపక్షాలతోనే ప్రజా సంక్షేమం, ఆదివాసీల సంక్షేమం సాధ్యమన్నారు.

అడవిపై హక్కును తేల్చే ఎన్నికలివి : వి.శ్రీనివాసరావు

అడవిపై హక్కు అదానీదా? ఆదివాసీలదా? అన్నది ఈ ఎన్నికలు తేల్చబోతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివాసీలపై కుట్రలు చేస్తున్న వారిని ఓడించాలని కోరారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం ఈ ప్రాంత అభివృద్ధిని అదానీకి తాకట్టు పెట్టి అటవీ భూములను అప్పగించి మోడీ ముందు మోకరిల్లిన వైసిపి ప్రభుత్వానికి, ఆ పార్టీ అభ్యర్థులకు ఆదివాసీలను ఓటు అడిగే హక్కులేదని తెలిపారు. ఈ ప్రాంతంలో జిఓ నెంబర్ 3 అమలు కాకుండా అడ్డం పడింది ఎవరో ఆదివాసీలకు ఎరుకేనని, గిరిజన యువత ఉద్యోగావకాశాలకు తూట్లు పొడిచింది ఎవరో తెలిసిందేనని అన్నారు. ఈ ప్రాంతానికి 588 ఉపాధ్యాయ ఉద్యోగాలు ప్రకటిస్తే అందులో గిరిజనులకు దక్కేవి 38 మాత్రమేనని, దీన్నిబట్టే వైసిపి ప్రభుత్వం గిరిజన యువతకు ఎంతటి అన్యాయం చేసిందో ఇట్టే అర్థమవుతుందని తెలిపారు. ఈ ప్రాంతంతో సంబంధంలేని వారిని ఇక్కడకు తీసుకొచ్చి గిరిజనుల్లో కలిపేసి ఎస్‌టి రిజర్వేషన్‌ను ఎత్తేసే కుట్ర చేసిన ఈ ప్రభుత్వాన్ని క్షమించరాదన్నారు. ఎటువంటి అభివృద్ధిలేక నేడు అరకులోయ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. అడవిపై హక్కు ఆదివాసీలదేనని, ఆదివాసీల భవిష్యత్తు ఇండియా వేదికపై ఆధారపడి ఉందని అన్నారు. ప్రస్తుతం బిజెపికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని విధ్వంసం చేయడానికి మోడీ సర్కారు పూనుకుందని మిగతా 2లో

భవిష్యత్తును మార్చే ఎన్నికలు

- జగన్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- నెల్లూరు జిల్లా సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి- ఆత్మకూరు అర్బన్ (నెల్లూరు జిల్లా)

వైసిపి మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్ అని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టిడిపి రిలీజ్ చేసిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని పేర్కొన్నారు. వైసిపి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చబోతున్నాయని పేర్కొన్నారు. శనివారం ఆయన నెల్లూరు జిల్లా ఆత్మకూరులోనూ, బుచ్చిరెడ్డిపాలెంలోనూ నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభల్లో ప్రసంగించారు. వైసిపి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో జగన్ రాజీనామా పత్రంలా ఉందని వ్యాఖ్యానించారు. కలెక్టరేట్లను, రైతు బజార్లను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని విమర్శించారు. రూ.14 లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారని, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా వారి భవిష్యత్తో ఆడుకున్నారని, విమర్శించారు. ప్రభుత్వోద్యోగులను జగన్ బానిసలుగా చూస్తున్నారని, మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టారని వివరించారు. ఐదేళ్లలో ఒక్క రహదారైనా వేశారా? అని ప్రశ్నించారు. బటన్ అందరూ నొక్కుతారని, బటన్ నొక్కడానికి సిఎం కావాలా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్‌డిఎ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్, భాజపాతో ఉండనని చెబుతున్న జగన్‌కు కేంద్రంలో ఎవరికి మద్దతిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరాలు, ఘోరాలు చేయడంలో జగన్ పిహెచ్‌డి చేశారని విమర్శించారు. దోచుకోవడం, దాచుకోవడంలో మంచి ఎక్స్‌పర్ట్ అని ఆరోపించారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని, దాన్ని అంతమొందించాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్ తుంగలో తొక్కారన్నారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి రాష్ట్రంలో విచ్చలవిడిగా జగన్ బ్రాండ్ మద్యం అమ్మకాలు చేస్తున్నారని, ఆడపడుచుల మంగళ సూత్రాలు తెంచుతున్నారని విమర్శించారు. ప్రభుత్వోద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తానని చెప్పి మోసగించారన్నారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగులు ఇస్తామని, ఏటా డిఎస్‌సి ప్రకటన ఇస్తామని, తొలి సంతకం డిఎస్‌సి ప్రకటనపైనే చేస్తానని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, అంగన్‌వాడీ కార్యకర్తలు, హోంగార్డుల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు.

ఆత్మకూరులోని నెల్లూరు పాళెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

గ్రీన్ క్రెడిట్ నిబంధనలు

వనరుల దోపిడీ కోసమే

- తక్షణమే ఉపసంహరించుకోవాలి
- కేంద్రానికి వందలాది సంస్థలు, ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : ప్రకృతి వనరుల దోపిడీకి సాధనంగా గ్రీన్ క్రెడిట్ నిబంధనలను, అందుకు అనుసరించే పద్ధతులను రూపొందించారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని వందమందికి పైగా పర్యావరణ, మానవ హక్కుల సంస్థలు, న్యాయవాదులు, ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. ఈ నిబంధనలకు సంబంధించి గతేడాది ఫిబ్రవరి 24న నోటిఫికేషన్ ఇవ్వగా, తాజా నోటిఫికేషన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి జారీ అయింది. గ్రీన్ క్రెడిట్ ఆదాయాల ద్వారా అటవీ మళ్లింపు చర్యలకు అందించే రాయితీలు వాస్తవానికి పర్యావరణాన్ని, అటవీ ప్రాంతాలను పణంగా పెడుతున్నాయని, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజల హక్కులను దెబ్బతీస్తున్నాయని ఆ లేఖ పేర్కొంది. వినూత్నమైన మార్కెట్ ఆధారిత యంత్రాంగంగా దీన్ని తెర మీదకు తీసుకువస్తున్నప్పటికీ, ఈ సహజ భూముల పరిరక్షణ, పునరుద్ధరణ, నిర్వహణల కోసం గ్రీన్ క్రెడిట్ నిబంధనలు మాత్రం అస్థిరమైన విధానాలతో మార్కెట్ శక్తులపై ఆధారపడతాయని ఆ లేఖ పేర్కొంది. వీటివల్ల వ్యాపార సంబంధిత కార్యకలాపాలు వేగవంతమవుతాయని, ఇవి పర్యావరణ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించేవని తెలిపింది. బాధిత కమ్యూనిటీలతో, నిపుణులతో విస్తృతంగా చర్చలు జరపకుండా ఇటువంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టరాదని కోరింది. పర్యావరణ పరిరక్షణకు హామీ కల్పిస్తూ చట్టబద్ధమైన యంత్రాంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ (జిసిపి) అనేది ప్రకృతి వనరుల దోపిడీకి మరో సాధనంగా మాత్రమే పనికి వస్తుందని ఆ లేఖ హెచ్చరించింది. పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్, లెట్ ఇండియా బ్రీత్, సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ, ధాత్రి ట్రస్ట్ తదితర 101 సంస్థలు, పలువురు రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు సహా 431మంది ప్రముఖులు ఈ లేఖపై సంతకాలు చేశారు.

పోలింగ్ ఏజెంట్లను బయటకీడ్చేశారు!

- త్రిపురలో రెండో విడతలోనూ అక్రమాల జోరు
- అంబాసోల్‌లో 112శాతం పోలింగ్
- ఇళ్లపై దాడులు, లూటీలు
- ఓటర్లకు బెరింపులు
- ఎన్నికల సంఘానికి ఇండియా బ్లాక్ నేతల ఫిర్యాదు

ఐటి కొలువులకు కత్తెర

- ఏడాదిలో 69 వేల మందికి ఉద్వాసన

లోపలి పేజీల్లో..

ప్రభుత్వం విస్మరించింది..

సంఘం ఆదుకుంది

- ప్రమాదాల్లో మరణించిన 11 మంది '108' సిబ్బంది
- బాధిత కుటుంబాలకు రూ.80.6 లక్షల సాయం
- ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ చొరవ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యవసర పరిస్థితుల్లో ఆఘమేఘాల మీద దూసుకొచ్చి ఎంతో మందికి ప్రాణం పోసిన '108' సర్వీసెస్ సిబ్బంది విధుల్లో ఉంటూ ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోకుండా ప్రభుత్వం విస్మరించింది. ఇంటిలో పెద్ద దిక్కుగా ఉన్నవారిని కోల్పోయి నానా ఇబ్బందులు పడుతున్నా ..ప్రభుత్వం కనికరించలేదు. ఏ సమస్య వచ్చినా పోరాటాలతో అండగా నిలిచిన సంఘమే కష్టకాలంలోనూ కొండంత అండగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన 11 మంది '108' సిబ్బందికి చెందిన బాధిత కుటుంబాలను ఆంధ్రప్రదేశ్ '108' సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆదుకుంది. ఉద్యోగుల నుంచి, ఇతరుల నుంచి విరాళాల రూపంలో రూ.80.6 లక్షలను సేకరించి మరణించినవారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి రూ.7.33 లక్షల చొప్పున అందజేసి అండగా నిలిచింది.

విధుల్లో ఉంటూ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన '108' సిబ్బంది సంస్మరణ సభ విజయవాడలోని బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, మిగతా 2లో



బాధిత కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న ఎవి నాగేశ్వరరావు, సుబ్బరావమ్మ తదితరులు

తెనాలిలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు మద్దతు

- సిపిఎం, సిపిఐ ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి

తెనాలి శాసనసభ నియోజకవర్గంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థి శవల గోపాల్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాల్ గెలుపుకోసం సిపిఎం, సిపిఐ శ్రేణులు కృషి చేస్తాయని పేర్కొన్నారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలందరూ గోపాల్‌కు ఓట్లేసి గెలిపించాలని కోరారు.

భువనగిరి మినహా తెలంగాణలో కాంగ్రెస్‌కు సిపిఎం మద్దతు

- సిఎం రేవంత్‌రెడ్డితో సిపిఎం నేతల భేటీ

8

దగ్ధమవుతున్న వాహనం

టిడిపి ప్రచార రథానికి నిప్పు

- డ్రైవర్‌కు గాయాలు- రోడ్డుపై బైఠాయించిన కార్యకర్తలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో గుర్తు తెలియని దుండగలు టిడిపి ప్రచార రథానికి నిప్పు పెట్టారు. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి టిడిపి కార్యకర్తల కథనం మేరకు..వాహనంలో డ్రైవర్ రాజు ఉండగానే గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. చాకచక్యంగా డ్రైవర్ తప్పించుకున్నప్పటికీ గాయాలయ్యాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పీలేరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, సంఘటనకు గల కారణాలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ప్రచార రథం డ్రైవర్‌ను పరామర్శించి, విఠలం సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. వైసిపి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిందితులను పట్టుకుంటామని పోలీసులు చేపడంతో ఆందోళన విరమించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారు?

- జగన్‌కు చంద్రబాబు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మద్యపానంపై నిషేదం విధించకుండా ఓట్లు ఎలా అడుగుతారని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019 నాటి ఎన్నికల మేనిఫెస్టోలో మద్యపానంపై నిషేదం విధిస్తామని జగన్ హామీ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. మద్యపాన నిషేదం అమల్జేసిన తర్వాతే ఓట్లు అడుగుతామని అప్పట్లో ప్రకటించిన జగన్ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. 'మేనిఫెస్టోను మత గ్రంథాలుగా పేర్కొన్న మీరు..వాటిపై ఏమాత్రం గౌరవమున్నా..మద్యపాన నిషేదం అమల్జేసివుండేవారు. కానీ మాట తప్పారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?' అని జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు ప్రశ్నించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎసిబికి చిక్కిన సిఐ ఇంట్లో సోదాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కిన ఏలూరు మూడో పట్టణ సిఐ వెంకటేశ్వరరావు ఇంటిలో అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో రూ. పది లక్షల నగదు, విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన ఏలూరు జిల్లా సత్రంపాడుకు చెందిన విక్టర్‌బాబుపై మూడో పట్టణ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడికి 41ఎ నోటీసు ఇచ్చేందుకు సిఐ రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. కానిస్టేబుల్‌కు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసులో శుక్రవారం రాత్రి, శనివారం సిఐ ఇంట్లో అధికారులు సోదాలు చేశారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నేతల ఆందోళన
- 'ఇండియా' అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- బాబూరావుకు మద్దతుగా సింగ్‌నగర్‌లో రోడ్ షో

సభలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ

మోడీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని పలువురు వక్తలు అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం, లౌకిక విలువలు, ఫెడరలిజం వంటి వాటిని కాపాడుకోవాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను తప్పక గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు విజయాన్ని కాంక్షిస్తూ భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విజయవాడలో రోడ్ షో నిర్వహించారు. అరండల్‌పేట (కూర్మయ్య వంతెన సెంటర్) నుంచి ప్రారంభమైన రోడ్ షో సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్ మీదుగా అజిత్ సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ వరకు సాగింది. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రాల హక్కులు, ప్రజల భవిష్యత్‌ను విస్మరించిన వైసిపి, టిడిపి నేతలు రాజకీయ స్వార్థంతో, వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని మోడీ వద్ద తాకట్టుపెట్టారని విమర్శించారు. మరోసారి మోడీ అధికారంలోకి వస్తే ఈ దేశం నియంతృత్వంలోకి వెళ్తుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయవాడ నగరాభివృద్ధి కోసం బాబూరావును గెలిపించాలని కోరారు. ప్రముఖ ఇంజనీర్ కె.విజయరావు మాట్లాడుతూ నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఐఎఎస్ అధికారి బండి శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశ ప్రజలకు తీవ్ర హాని చేస్తున్న బిజెపి, టిడిపి, వైసిపిలను చిత్తుగా ఓడించాలని కోరారు. సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ.. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన బిజెపి, టిడిపి, వైసిపిలకు ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. ఆటో, భవన నిర్మాణం, చిరు వ్యాపారులు, మోటార్ తదితర రంగాల కార్మికులు, ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై నింతరం పోరాడుతున్న తమను గెలిపించాలని కోరారు.

పాలిసెట్‌కు 88.74 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 422 పరీక్షా కేంద్రాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాతంగా ముగిసింది. 2024-25 విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉద్దేశించిన ఈ పరీక్ష రాసేందుకు 1,59,989 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 1,41,978 (88.74శాతం) మంది హాజరయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ విజయవాడలోని ఆంధ్రా లయోల కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ సిహెచ్ నాగరాణి తాడేపల్లిగూడెం, ఏలూరులో పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ నెల 30న ప్రాథమిక 'కీ'ని aps-btet.ap.gov.in లో పొందుపర్చుతామని కమిషనర్ తెలిపారు. వచ్చే మే నెల 10లోపు ఫలితాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జూన్ మొదటి వారం నుంచి తరగతుల నిర్వహణకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేశామని తెలిపారు.

వైసిపిలో అడుగడుగునా అవమానాలు

- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వర ప్రసాద్

వైసిపిలో అడుగడుగునా అవమానాలకు గురయ్యానని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి పదేపదే తక్కువగా చూసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌తో ప్రయాణం బాగుంటుందని అనుకున్నప్పటికీ అది నిరాశ కలిగించిందని చెప్పారు. రాజధాని ప్రాంతం వెంకటపాలెంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తాడికొండకు ఎమ్మెల్యే శ్రీదేవి ఉండగా తనను ఆ నియోజకవర్గానికి వైసిపి సమన్వయకర్తగా నియమించడంతో ఆమెకు, తనకు మధ్య గొడవలకు దారితీసిందని చెప్పారు. తరువాత తనను ఏ మాత్రమూ సంప్రదించకుండా కత్తెర సురేష్ కుమార్‌ను ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారన్నారు. తాడికొండ టికెట్ తనకు కేటాయిస్తామని చెప్పి మేకతోటి సుచరితకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనకు మాట కూడా చెప్పకపోవడం, తనను పిలిచి మాట్లాడక పోవడంతో చాలా అవమానంగా ఫీలయ్యానని చెప్పారు. ఒత్తిడికి గురై తప్పనిసరి పరిస్థితుల్లో వైసిపికి రాజీనామా చేశానని చెప్పారు. వైసిపిలో, ప్రభుత్వంలో తనకు ప్రాధాన్యత లేకుండా చేశారని వాపోయారు. వైసిపిలో ఏమి కోల్పోయానో అది టిడిపిలో దక్కుతుందని భావిస్తున్నానన్నారు. అమరావతి రైతులకు న్యాయం జరగాలన్నదే తన అభీష్టమన్నారు. ఎమ్మెల్యేలను కలుస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తదితర అంశాలను వైసిపి మేనిఫెస్టోలో పొందుపరిస్తే బాగుంటుందన్నారు.

మా ప్రచార వాహనాలను ఆపుతారా?

- ఎన్నికల అధికారిపై మంత్రి సీదిరి ఆగ్రహం

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

ఎన్నికల అధికారితో వాగ్వివాదానికి దిగిన మంత్రి అప్పలరాజు

తమ ప్రచార వాహనాలను ఎందుకు ఆపారంటూ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆశాలతతో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి, పలాస వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో శుక్రవారం రాత్రి మంత్రి తన ఎన్నికల ప్రచారం నిర్వహించి పలాస బయలుదేరారు. పలాసలోని కోసంగిపురం జాతీయ రహదారి వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రచార వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి అక్కడకు చేరుకుని, ఎందుకు వాహనాలను ఆపారని ప్రశ్నించారు. ప్రచార రథాలపై ఒక జెండా పెద్దదిగా ఉందని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, అందుకే ఆపామని మంత్రికి ఆమె బదులిచ్చారు. దీంతో, 'ఏంటీ తమాషా చేస్తున్నారా? రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రచార రథాలు ఇలానే ఉన్నాయి. పలాసలోనే సమస్య వచ్చిందా? ప్రచార రథం, రూ.లక్ష ఇస్తాను. మీ ఇష్టమొచ్చినట్లు తయారు చేయించి వాహనాన్ని ఇవ్వండి' అంటూ ఆమెపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఆపారని, మరోసారి ఇలా చేస్తే బాగోదని హెచ్చరించారు. ప్రచార రథం ఇలాగే ఉంటుందని, ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండి అంటూ సమాధానం ఇచ్చారు. నిబంధనలు చెప్తుంటే గొడవ పెట్టుకుంటారేంటని మంత్రిని ఆమె ప్రశ్నించారు. తన విధులకు మంత్రి అప్పలరాజు ఆటంకం కలిగించారంటూ పలాస ఎన్నికల అధికారులకు ఆశాలత ఫిర్యాదు చేశారు.

వాహన తనిఖీలు

- రూ.4.42 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు శనివారం పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. రూ.4.42 లక్షల నగదును పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఈ నగదును సీజ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలోని ఎ.ఎస్.పేట వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం జయంతిపురానికి చెందిన సురేష్‌కుమార్ సాహు వద్ద రూ.1.21 లక్షల నగదు పట్టుబడింది.

ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్‌గా పని చేస్తున్న ఆయన ఎలాంటి పత్రాలు లేకుండా స్కూటీలో నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో రూ.1,66,500 నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. తెనాలి నియోజకవర్గం పరిధిలో రూ.లక్ష, తాడికొండ నియోజకవర్గం పరిధిలో రూ.66,500 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలంలోని సరిపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో ఎటువంటి పత్రాలూ లేకుండా తరలిస్తున్న రూ.1,54,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్‌టి అధికారి లక్ష్మీసరస్వతి తెలిపారు. విప్పర్రు గ్రామానికి చెందిన గంగారంచంద్రం నుంచి రూ.70 వేలు, నిడమర్రు మండలం మందలపర్రు గ్రామానికి చెందిన చిరుతపురి వెంకట రామకృష్ణ నుంచి రూ.84,500 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

కల్లుగీత కార్మికులపై కేసులు ఎత్తివేస్తాం

- మద్యం వ్యాపారిలా జగన్
- ప్రజారాజ్యం విలీనానికి కారకుడు కన్నబాబు
- ప్రచార సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

ఇంద్రపాలెం సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

కల్లుగీత కార్మికులపై అక్రమంగా తొమ్మిది వేల కేసులు పెట్టారని, కూటమి అధికారంలోకి రాగానే ఈ కేసులను ఎత్తివేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. గత ఎన్నికల సమయంలో మద్యపాన నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత తానే మద్యం వ్యాపారిలా జగన్‌మోహన్‌రెడ్డి మారిపోయారని విమర్శించారు. శనివారం రాత్రి కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇంద్రపాలెం, పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోటలో జరిగిన వారాహి విజయ భేరి ప్రచార సభల్లో పవన్ ప్రసంగించారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.41 వేల కోట్లను మద్యం ద్వారా అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి కంపెనీల నుంచి వస్తున్న నాసిరకం మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని విమర్శించారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి ముఖ్య కారకులు కన్నబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న డొక్కు స్కూటర్‌పై తిరిగిన వ్యక్తి, పిలిస్తే పరిగెత్తుకుని వచ్చే వ్యక్తి నేడు ఎమ్మెల్యే అయిన తరువాత అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాకలపూడిలో అక్రమ లే అవుట్ల వ్యవహారంలో అనేక మంది బాధితులు కన్నబాబు తీరుపై మండిపడుతున్నారన్నారు. ఎక్కడ లేఅవుట్లు వేసినా ఆయనకు భారీగా ముడుపులు సమర్పించుకోవాల్సి వస్తుందని, కన్నబాబు, ఆయన కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక ఓ వైద్యుడు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. చిరంజీవిని జగన్ అవమానిస్తే కనీసం కన్నబాబు స్పందించలేదని ధ్వజమెత్తారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వడం కుదరదు అని జగన్ చెప్పినప్పుడు.. కన్నబాబు పక్కనే ఉన్నా ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నారన్నారు. ఒక దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుని కాకినాడ పార్లమెంటు వైసిపి అభ్యర్థి సునీల్ తన పక్కనే తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వంటి అక్రమార్కుల అంతు తేలుస్తానని హెచ్చరించారు. అందుకోసమే తాను ఈ జిల్లా నుంచి పోటీ చేస్తున్నానని చెప్పారు. కూటమి బలపర్చిన జనసేన, టిడిపి, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయన వెంట కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి తదితరులున్నారు.

బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం

మొదటిపేజి తరువాయి

విమర్శించారు. అరకు ప్రాంతంలో ఆర్ఎస్ఎస్ మకాం వేసి మరో మణిపూర్‌గా మార్చడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. అరకు బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బిజెపి కూటమిని, వైసిపిని ఓడించాలని కోరారు. సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స మాట్లాడుతూ 2004లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి బిజెపిని తరిమికొట్టారని, ఇప్పుడూ అదే జరగనుందని అన్నారు.

ఆయా చోట్ల జరిగిన సభల్లో పాడేరు, అరకు, పాయకరావుపేట నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు శతక బుల్లిబాబు, శెట్టి గంగాధర్‌స్వామి, బోని తాతారావు, కాంగ్రెస్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అనంతగిరి జడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిపిఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అరకులోయ, పాడేరు సభలకు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. గిరిజన కళాకారుల థింసా నృత్యం, ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సంక్షేమం కొనసాగిస్తాం

మొదటిపేజి తరువాయి

ఇస్తామని తెలిపారు.

క్రమ తప్పకుండా గ్రూపు పరీక్షలు

యువత కోసం క్రమం తప్పకుండా గ్రూప్-1, 2 పరీక్షలు నిర్వహిస్తామని, యుపిఎస్‌సి తరహాలో నిర్దిష్ట సమయంలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తిరుపతిలో స్కిల్ యూనివర్శిటీ, విశాఖలో స్టార్టప్ హబ్, ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజ్ నిర్మించడంతోపాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం నిరంతరం కృషి కొనసాగిస్తామన్నారు. యూనివర్శిటీల్లో పెండింగ్‌లో ఉన్న 3295 పోస్టులు భర్తీ చేస్తామని వివరించారు. 2025లో ఒకటో తరగతికి ఐబి విద్యావిధానం ఉంటుందని, ప్రతి ఏటా ఈ విధానాన్ని తరగతుల వారీగా పెంచుకుంటూ పోతామని తెలిపారు. మత్స్యకార భరోసా ఇక నుండి లక్షకు పెంచుతామని, ఆటోటాక్సీ డ్రైవర్లకు ఐదేళ్లలో రూ.లక్ష లబ్ది కలిగిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లపాటు న్యాయవాదులకు నెలభృతి ఇచ్చే పథకాన్ని కొనసాగిస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం కొనసాగిస్తామని, వచ్చే ఐదేళ్లలో ఐదు కొత్త మెడికల్ కళాశాలలు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

కొత్త పంచాయతీలు...

వచ్చే ఐదేళ్లలో గ్రామంలో మొత్తం జనాభాలో 50 శాతం దళితులు ఉండి, 500కుపైగా ఉన్న ఆవాసాలను ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటు చేస్తామని, క్రిస్టియన్ మైనార్టీలకు సబ్‌ప్లాను పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. ప్రార్థనా స్థలాల నిర్వహణకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కుల వృత్తులకు ఇప్పటి వరకూ ఇస్తున్న జగనన్న తోడు రుణ పరిమితిని రూ.10 వేల నుండి రూ.15 వేలకు పెంచుతున్నట్లు వివరించారు. రూ.20 వేల వరకూ వడ్డీలేని రుణం ఇస్తామని చెప్పారు. నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, రజకులకు జగనన్న చేదోడు పథకం కొనసాగిస్తామని వివరించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు, రోడ్ల మరమ్మతు, జిల్లా కేంద్రాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేసేందుకు రూ.2000 కోట్లు నిధులు కేటాయిస్తామని వివరించారు. ప్రతి జిల్లాలో పిపిపి పద్ధతిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, ఎంఎస్ఎంఇలకు ప్రతి ఏటా ప్రోత్సాహకాలు ఇస్తామని వివరించారు.

అమృతరావు స్ఫూర్తితో 'ఉక్కు' పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం పోరాటం చేసిన మహనీయుడు అమృతరావు స్ఫూర్తితో నేడు అదే కర్మాగారం పరిరక్షణకు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే దీక్షలు శనివారానికి 1171వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరంలో అమృతరావు 35వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, వై మస్తానప్ప, డిసిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాడు అమృతరావు స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. త్యాగాలతో ఏర్పడ్డ ఈ కర్మాగారాన్ని నేటి పాలకులు అమ్మేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని అనుకోవడం దుర్మార్గమన్నారు. అమృత రావు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు బివి రమణమూర్తి, వరప్రసాద్, జగదీష్, చంద్రశేఖర్, డి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

చర్చల అనంతరం కార్మికులతో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

గంగవరం పోర్టు కార్మికులతో చర్చలు విఫలం

- నేడు మరోసారి సమావేశం

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

సమస్యల పరిష్కారానికి అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం, కార్మికుల మధ్య శనివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తొలుత అక్కయ్యపాలెంలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ, ఆ తరువాత నగర పోలీస్ కమిషనరేట్‌లోనూ చర్చలు జరిగాయి. జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో జెసిఎల్ గణేష్, అడిషనల్ లేబర్ కమిషనర్ లక్ష్మీనారాయణ, గంగవరం పోర్టు డిజిఎం నారాయణతో పాటు కార్మికుల పక్షాన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కార్మికులకు మేజర్ పోర్టుల్లో కార్మికులకు ఇచ్చినట్లుగా రూ.36 వేలు వేతనం చెల్లించాలని, అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని, సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, క్యాంటీన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఆ డిమాండ్లన్నీ మినిట్స్ బుక్‌లో జెసిఎల్ కార్యాలయంలో నమోదు చేశారు. పై డిమాండ్లకు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం నుండి సానుకూలంగా స్పందన రాలేదు. చర్చల్లో గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి.జగన్, కొవిరి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీసు కమిషనరేట్‌లో సిపి రవిశంకర్ సమక్షంలో మరోసారి చర్చలు జరిగాయి. వీటిలోనూ ఎటువంటి పురోగతి కనిపించలేదు. ఇలా రెండు చోట్లా చర్చలు విఫలయమ్యాయి. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మళ్లీ చర్చలు జరగనున్నాయి. పోలీస్ కమిషనర్ దగ్గర జరిగే చర్చలకు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కూడా హాజరుకానున్నాయి.

ఒకటిన ఇళ్ల వద్దకే పింఛన్లు

- గవర్నర్, సిఎస్‌లను కోరిన కూటమి నేతలు
- సిఎస్‌కు వ్యతిరేకంగా ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక పింఛన్లను 1వ తేదీనే లబ్ధిదారులకు ఇంటివద్ద అందించేలా చర్యలు తీసుకోవాలని టిడిపి-జనసేన-బిజెపి కూటమి నేతలు గవర్నర్‌ను కోరారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శనివారం వారు రాజ్‌భవన్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఇళ్ల వద్దకే పింఛన్ల పంపిణీ చేసేలా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అంతకుముందు సిఎస్ కెఎస్ జవహర్ రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. పింఛన్ల పంపిణీపై సిఎస్ స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆయన కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సిఎం, సిఎస్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నేత, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ దురుద్దేశపూర్వకంగా ప్రభుత్వానికి, వైసిపికి లబ్ధి చేకూర్చాలని సిఎస్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. . పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు 4లక్షల మంది ఉన్నారని వివరించారు. ఒక్కొక్క ఉద్యోగికి 20 మందిని కేటాయించి, పింఛన్ల పంపిణీ నిర్వహించాలన్నారు. గవర్నర్ ఈ అంశంపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. సిఎస్, గవర్నర్‌ను కలిసిన వారిలో టిడిపి నేతలు వర్ల రామయ్య, బుచ్చి రాంప్రసాద్, మన్నవ సుబ్బారావు, మాణిక్యారావు, జనసేన నేతలు చిల్లపల్లి శ్రీనివాసరావు, శివశంకర్, బిజెపి నేతలు దినకర్, సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సిఎం జగన్ విడుదల చేసిన వైసిపి మానిఫెస్టో కొత్త సీసాలో పాత సారాలా ఉందని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు, ఆ పార్టీ నేత జీవిరెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు.

ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించాలి

- 'ఆశా' డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌తో పాటు, ఇతర ఆరోగ్య పథకాలకు సంబంధించిన బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రయివేటు ఆసుపత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం 'ఆశా' ఉపాధ్యక్షులు డాక్టర్ వై రమేష్ బాబు, కార్యదర్శి అవినాష్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆరు నెలల నుంచి ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించడం లేదని, దాదాపు రూ.1200 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ బిల్లులను ఏ నెలకు ఆ నెల చెల్లించడం లేదని, దీనివల్ల ఆసుపత్రుల నిర్వహణ భారంగా మారుతోందని తెలిపారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విస్మరించింది.. సంఘం ఆదుకుంది

మొదటిపేజి తరువాయి

ఎఐఎంఎస్ డైరెక్టర్ గంగాధర్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె సుబ్బారావమ్మ తదితరులు అమరులైన '108' సిబ్బందికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.7.33 లక్షల చొప్పున రూ.80.6 లక్షల సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ యూనియన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన '108' సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడంలో ఇటు ప్రభుత్వం కానీ, అటు యాజమాన్యం కానీ నిర్లక్ష్యం వహించాయని, ఈ నేపథ్యంలో యూనియన్ విరాళాల రూపంలో డబ్బులు సమీకరించి ఆదుకుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కనీసం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అమరులైన '108' సిబ్బంది దాసం జయకుమార్‌రెడ్డి (అల్లూరి జిల్లా), దాసరి కనకరాజు (అల్లూరి జిల్లా), బంకూరు తవిటి నాయుడు (మన్యం జిల్లా), కిల్లి వెంకట సత్యనారాయణ (శ్రీకాకుళం), మారుతోట కిరణ్‌కుమార్ (ప్రకాశం), వెట్టి విజయ్‌కుమార్‌బాబు (కడప), ఆనూరి సుధాకర్ (కడప), ఎపి మురళీమోహన్ (నంద్యాల)కు చెందిన కుటుంబ సభ్యులకు చెక్ ద్వారా ఆర్థిక సహాయాన్ని యూనియన్ నాయకులు అందించారు.

అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం ఒట్టిగెడ్డలో ప్రచారం నిర్వహిస్తున్న లోతా రామారావు

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రిక్షా తొక్కుతూ ప్రచారం చేస్తున్న బాబూరావు

సమస్యలపై పోరాడే వామపక్షాలకే ఓటు

- రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, దానికి వంతపాడే పార్టీలను ఓడిద్దాం
- సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సిపిఎం అభ్యర్థులు శనివారం ముమ్మరంగా ప్రచారం చేశారు. తమ నియోజకవర్గాల్లో తిరుగుతూ బిజెపి, వైసిపి, టిడిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు. మతోన్మాద బిజెపిని, ఆ పార్టీతో జతకట్టిన టిడిపి, జనసేనలను, రాష్ట్రంలో నిరంకుశ వైఖరితో మోడీ విధానాలు అమలు చేస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సమస్యలపై పోరాడే వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు.

నెల్లూరులోని 14వ డివిజన్‌లో నియోజకవర్గం అభ్యర్థి మూలం రమేష్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పాల్గొన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలులో విఫలమైందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందని వివరించారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాధత్తం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారంలో తమకు 400 సీట్లు దక్కుతాయని బూటకపు ప్రచారం చేస్తూ ప్రజలను మోడీ తప్పుదారి పట్టించాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నగరాభివృద్ధికి మూలం రమేష్‌ను గెలిపించాలని కోరారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడులో పాణ్యం నియోజకవర్గం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని వడ్లోనివంకను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయడంతో వర్షం వస్తే ఎస్‌సి, బిసి కాలనీలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వర్షా కాలంలో ఇళ్లలోకి నీళ్లు వచ్చి ధాన్యం తడిసి పోయి తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని వాపోయారు. ప్రధానంగా తాగునీటి సమస్య వెంటాడుతోందని తెలిపారు. గౌస్‌దేశాయ్ స్పందిస్తూ రియల్టర్ల కోరల్లో నుంచి వడ్లోనివంకను కాపాడతానని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో సిపిఎం మంగళగిరి నియోజకవర్గం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, సిపిఐ పార్లమెంట్ అభ్యర్థి జంగా ఆంజనేయులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిశారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విశాఖలోని కొండవాలు ప్రాంతాలైన సుందరయ్యకాలనీ, దుర్గానగర్, అరుణోదయ కాలనీ, గుడివాడ గురునాథరావు కాలనీ, దిబ్బపాలెం, శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, ఆఫీసర్స్ కాలనీ, కర్ణవానిపాలెం ప్రాంతాల్లో గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. జివిఎంసి 69వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జగ్గునాయుడు గెలుపును కోరుతూ సిపిఎం నాయకులు ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో అభ్యర్థి లోతా రామారావు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. ప్రచారంలో పాల్గొన్న రామారావుకు మహిళలు పూలమాలలు వేసి, తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. ఎటపాక మండలం గొల్లగట్ట గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో సిపిఎం నాయకులు సమావేశమై సిపిఎం అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు, బాలేసుగూడ, నెల్లికెక్కువ, వనకాబడిలో కురుపాం నియోజకవర్గం అభ్యర్థి మండంగి రమణ ప్రచారం నిర్వహించారు కొమరాడ మండలం కూనేరు సంతలో రమణ, ఎంపి అభ్యర్థి అప్పలనర్స విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపితే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు ప్రచారం నిర్వహించారు. వాకర్లను, క్రీడాకారులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం 32వ డివిజన్ అయోధ్యనగర్, రామలింగేశ్వరపేట, బసవతారక నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. రిక్షా తొక్కుతూ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు.

విజయవాడ రూరల్ మండలం గూడవల్లి, ఎనికెపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో గన్నవరం నియోజకవర్గం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరుతూ కళాకారులు పాటలు, వీధి నాటికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. బిజెపిని, దానితో జతకట్టిన టిడిపి, జనసేనలను, నిరంకుశ వైసిపిని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు 14వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మూలం రమేష్, డి.రమాదేవి

గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ప్రచారం నిర్వహిస్తున్న జొన్నా శివశంకరరావు, అజయ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

లారీని కారు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... విశాఖ జిల్లాలో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన శరగడం వెంకటలక్ష్మి (45), ఆమె కుమారుడు వికాస్, బంధువైన కూర్మన్నపాలెంనకు చెందిన దాడి గగన్ (14), విశాఖపట్నంకు చెందిన సుంకర మధుకర్ (22) కారులో కాకినాడ బయలుదేరారు. నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద వారి కారు టైరు పంచరయ్యింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటుకుని తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రోడ్డు మార్గంలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి, గగన్, మధుకర్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు నడుపుతున్న వికాస్ తీవ్రంగా గాయపడి అనకాపల్లిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సిఐ విజయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గగన్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మధుకర్ ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో అప్రెంటిస్ చేస్తున్నారు.

గగన్

వెంకటలక్ష్మి

మధుకర్

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంసెట్ బుక్స్ ఇవ్వాలని విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి (విజయనగరం)

ఎంసెట్ బుక్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజనగరం జిల్లా బొబ్బిలిలోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ధర్నా చేశారు. కళాశాలలోని ఇంటర్ విద్యార్థుల నుంచి యాజమాన్యం ఎంసెట్ బుక్స్ కోసం డబ్బులు వసూలు చేసింది. ఈ కళాశాలలోనే కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన యాజమాన్యం బయట ప్రయివేటుగా కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇవ్వలేదు. బుక్స్ కోసం ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ ఎంసెట్ బుక్స్ కోసం విద్యార్థులు నుంచి డబ్బులు వసూలు చేసి ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుక్స్ ఇస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైసిపి పాలనలో విద్యుత్ సంక్షోభం

- ఎన్‌డిఎ నేతల ఆరోపణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యుత్తు రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఎన్‌డిఎ పక్షాల నేతలు ఆరోపించారు. ప్రజలపై రూ.1.5 లక్షల కోట్ల విద్యుత్తు చార్జీల భారం మోపారని విమర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి జివి రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి విజయ్‌కుమార్, బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో సౌర విద్యుత్తు కొనుగోలులో అక్రమాలు జరిగాయని, రూ.వందలాది కోట్లు చేతులు మారాయని వారు ఆరోపించారు. ట్రూ అప్, ఫిక్సిడ్, అదనపు ఛార్జీల పేరుతో 8 సార్లు జనంపై భారాలు మోపారని తప్పుబట్టారు. దీనికారణంగా పలు పరిశ్రమలు కూడా మూతపడ్డాయని తెలిపారు.

ఏడాది చివరి నాటికి నిఫ్టీ 25,810కి చేరొచ్చు

- ప్రభుదాస్ లిల్లాధర్ అంచనా



ముంబయి : ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఎన్ఎస్ఇ నిఫ్టీ 25,810కి చేరొచ్చని ప్రభుదాస్ లిల్లాధర్ తన తాజా ఇండియా స్ట్రాటజీ నివేదికలో పేర్కొంది. సాధారణ రుతుపవనాల కొనసాగింపు, ఎన్‌డిఎ ప్రభుత్వం కొనసాగితే నిఫ్టీలో పెరుగుదల ఉండొచ్చని తెలిపింది. రాబోయే 12 నెలల కాలానికి లేదా డిసెంబర్ 2025 నాటికి 25810 నుంచి 27100కి చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఒక వేళ ట్రెండ్ రివర్స్ అయి బేర్ కేర్ ట్రెండ్‌లో పడినట్లయితే 1శాతం తగ్గి 23వేల స్థాయిలకు చేరువలో ఉండొచ్చని ప్రభుదాస్ లిల్లాధర్ ఇన్స్టిట్యూషనల్ రీసెర్చ్ హెడ్ అమ్నీష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ దశాబ్దంలో కీలక ఘట్టమైన సాధారణ ఎన్నికలలో జూన్ 4 వరకు మార్కెట్ పతనమయితే స్టాక్స్ కొనుగోళ్లకు అనుకూల సమయమన్నారు.

గూగుల్‌తో పిచాయ్‌కు 20 ఏళ్ల బంధం

న్యూఢిల్లీ : గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ ఆ సంస్థలో చేరి 20 ఏళ్లు అయినట్లు తెలిపారు. 2004లో సంస్థలో ప్రొడక్ట్ మేనేజర్‌గా గూగుల్‌లో తన తొలి రోజు ప్రారంభమయ్యిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ సంస్థలో చాలా మార్పులు జరిగాయన్నారు. సాంకేతికత, మా ఉత్పత్తులను ఉపయోగించే ప్రజల సంఖ్య సహా అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. తన జట్టులో కూడా మార్పులు వచ్చాయని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ గొప్ప సంస్థలో పని చేస్తుంటే నాకు కలిగే ఉత్సాహం మాత్రం తగ్గలేదన్నారు. 20 ఏళ్లలో అంచెలంచలుగా ఎదుగుతూ.. 2015లో సిఇఒగా పగ్గాలు చేపట్టారు.

ఐసిఐసిఐకు రూ.11,672 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18.5 శాతం వృద్ధితో రూ.11,672 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,853 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.31,021.13 కోట్లుగా ఉన్న వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ4లో 22.33 శాతం పెరిగి రూ.37,948 కోట్లకు చేరింది. కాగా.. 2023-24కు గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.10 డివిడెండ్ ప్రతిపాదనకు ఆ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ముగింపు నాటికి 2.3 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు.. మార్చి ముగింపు నాటికి 2.16 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 0.44 శాతం నుంచి 0.42 శాతానికి పరిమితమయ్యాయి.

యెస్ బ్యాంక్ లాభాల్లో 123% వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో యెస్ బ్యాంక్ 123 శాతం వృద్ధితో రూ.452 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.202 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ.6,216 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ4లో 20 శాతం పెరుగుదలతో 7,447 కోట్లకు చేరింది. 2023-24లో మొత్తంగా రూ.1,251 కోట్ల నికర లాభాలు సాధించినట్లు తెలిపింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.2 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.9 శాతం నుంచి 0.6 శాతానికి దిగివచ్చాయి.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఎన్ఐఐలో వృద్ధి

న్యూఢిల్లీ : మార్చి 2024తో ముగిసిన త్రైమాసికంలో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నికర లాభాలు 10 శాతం తగ్గి రూ.724 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.803 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.3,597 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) గడిచిన త్రైమాసికంలో 24 శాతం పెరిగి రూ.4,469 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.51 శాతం నుంచి 1.88 శాతానికి.. నికర ఎన్‌పిఎలు 0.86 శాతం నుంచి 0.60 శాతానికి తగ్గాయి.

ఐటి కొలువులకు కత్తెర

- ఏడాదిలో 69వేల మందికి ఉద్వాసన
- టాప్4 కంపెనీలో భారీగా కుదింపులు
- కొత్త నియామకాలకు విముఖత..!

న్యూఢిల్లీ : ఒకప్పుడు భారీగా డిమాండ్ ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) ఉద్యోగాలు ఇప్పుడు గాల్లో దీపంలా మారాయి. ఉన్న కొలువులపై వేటు పడుతుండగా.. మరోవైపు కొత్త నియామకాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. గడిచిన ఒక్క ఏడాదిలోనే భారత్‌కు చెందిన అగ్రశ్రేణీ నాలుగు ఐటి కంపెనీల్లో దాదాపు 70వేల ఉద్యోగాలు క్షీణించడమే ఇందుకు నిదర్శనం. దిగ్గజ టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా కంపెనీలు క్రితం ఆర్థిక సంవత్సరం 2023-24నకు సంబంధించిన ఆర్థిక ఫలితాలను వెల్లండించాయి. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఖ్యను వెల్లడించగా.. గడిచిన ఏడాదిలో నికరంగా 69,000 సిబ్బంది తగ్గినట్లు వాటి గణంకాల్లో వెల్లడయ్యింది. కాగా ఒక్క హెచ్‌సిఎల్‌లో మాత్రమే నికరంగా ఉద్యోగుల సంఖ్య 1,537 మేర పెరిగింది. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్‌లో ఒక్క ఏడాదిలోనే 13,249 మంది ఉద్యోగులు తగ్గి.. 2024 మార్చి ముగింపు నాటికి 6,01,546కు కుదించబడ్డారు. రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగుల సంఖ్య 3,43,234 నుంచి 3,17,240కి క్షీణించింది. ఈ కంపెనీలో ఏడాదిలోనే 25,994 మంది కోత పడ్డారు. మరో దిగ్గజ ఐటి కంపెనీ విప్రోలో 2023 మార్చి ముగింపు నాటికి 2,58,570 మంది సిబ్బంది ఉండగా.. ఈ ఏడాది మార్చి ముగింపు నాటికి 2,34,054కు కుదించబడ్డారు. దీంతో ఒక్క ఏడాదిలోనే 24,516 మంది ఉద్యోగులు తగ్గారు. టెక్ మహీంద్రాలోనూ నికరంగా 6,945 ఉద్యోగులు కుదించబడ్డారు.

దేశీయ, అంతర్జాతీయంగా నెలకొన్న మందగమనం సంకేతాలు ఐటి కంపెనీలను బెంబేలెత్తిస్తున్నాయి. కాగా.. కంపెనీల రెవెన్యూ, లాభాలు భారీగా పెరిగినప్పటికీ పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందికి ఎసరు పెట్టడం గమనార్హం. ఇకపై మరింత తక్కువ వేతనాలకు ఫ్రెషర్లను తీసుకోవాలని టెక్ కంపెనీలు భావిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో టిసిఎస్ సుమారు 40 వేల మందిని, హెచ్‌సిఎల్ 10 వేల మంది, టెక్ మహీంద్రా 6 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ప్రకటించడం అభ్యర్థులకు కొంత ఊరట కలిగించే అంశం. అయితే ఇప్పటికిప్పుడే నియామకాలు ఉండకపోవచ్చని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. దేశీయంగా ఆర్థిక వ్యవస్థలో పెద్దగా డిమాండ్ లేకపోవడానికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో ఐటి సర్వీసులకు గిరాకీ తగ్గింది. మరోవైపు అన్ని కంపెనీలు పొదుపు చర్యలకు దిగినట్లే ఐటి సంస్థలు అదే బాటలో నడుస్తున్నాయని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఆమంచి నామినేషన్ ఆమోదం

- ఆర్ఓ సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

కాంగ్రెస్ పార్టీ చీరాల అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్ ఎన్నికల అధికారులు ఆమోదించారు. విద్యుత్ బకాయిలు చెల్లించలేదని ఎ.రామకృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఆమంచి నామినేషన్‌ను అధికారులు పెండింగ్‌లో పెట్టిన విషయం విదితమే. ఆర్ఓ సూర్యనారాయణరెడ్డి శనివారం దీనిపై స్పష్టత ఇచ్చారు. ప్రజాప్రతినిధ్య చట్టంలోని 1951 సెక్షన్ 8, 8ఏ ప్రకారం నామినేషన్లను తిరస్కరించడం, ఆమోదించటానికి సంబంధించి పూర్తిగా విశదీకరించామని, ఎన్నికల నిబంధనల ప్రకారం రామకృష్ణ ఫిర్యాదు చెల్లుబాటు కాకపోవడంతో ఆమంచి నామినేషన్‌ను స్క్రూట్నీ చేసి ఆమోదించామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మృతి చెందిన యుఎల్.మోహన్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగన్నగారిపల్లి గ్రామానికి చెందిన యుఎల్.మోహన్ (36) టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య రామంజులమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మోహన్ తిరిగి రాలేదు. గ్రామ శివారులో విగతజీవిగా పడి ఉన్న మోహన్‌ను శనివారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన కార్మికులు

వేతనాలివ్వకుంటే 3 నుంచి సమ్మె

- మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాలుగు నెలల పెండింగ్ వేతనాలు రెండో తేదీన చెల్లించకుంటే మూడో తేదీ నుంచి సమ్మెకు దిగుతామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. వేతన బకాయిల కోసం పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ.. ప్రతి నెల వేతనాలు చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారులను కార్మికులు ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్ మాట్లాడుతూ.. వార్డు కార్యదర్శుల కింద కార్మికులు పనిచేయాలనే నిబంధనను ఎత్తేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యుల పేర్లను ఆప్కాస్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ట్రాక్టర్ ఢీకొని ఇటీవల మృతి చెందిన డి.కోటయ్య కుటుంబానికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా, రెండు సెంట్ల స్థలం ఇస్తామన్న రాతపూర్వక హామీని సత్వరం నెరవేర్చాలని కోరారు. కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, దుస్తులు, పనిముట్లు ఇవ్వడంతో పాటు ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

దీనిపై మున్సిపల్ అధికారులను ప్రజాశక్తి సంప్రదించగా బకాయి వేతనాలను ఒకటో తేదీన జమ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.మల్లయ్య, డి.యోహాన్, పి.దీనమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

వెలువడింది

నయవంచన

10 సంవత్సరాల నిరంకుశ పాలన
10 దారుణ మోసాలు

వెల : రూ. 20



చరిత్రలో ఏ కేంద్ర ప్రభత్వమూ చేయనంత ద్రోహాన్ని మన రాష్ట్రానికి బిజెపి పాలిత కేంద్ర ప్రభుత్వం చేసింది. అయినా మన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార వైఎస్ఆర్‌సిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలతో సహా అంతటి ద్రోహానికి తలపడ్డ బిజెపితో అంటకాగుతున్నారు. ఈ పుస్తకం ఆ ద్రోహాల్ని శక్తివంతంగా వివరించింది.

ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్ - 9490099057

ఫారం ఎ
బహిరంగ ప్రకటన
(దివాలా మరియు దివాలాబోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రీసోల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పోరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్) రెగ్యులేషన్స్, 2016 రెగ్యులేషన్ 6 క్రింద)
కరుతూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్రెడిటార్ల దృష్టికి

సంబంధిత వివరాలు		
1.	కార్పొరేట్ రుణగ్రహీత పేరు	కరుతూరి సెరామిక్ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విలీనం తేది	18.06.2010
3.	కార్పొరేట్ రుణగ్రహీత అధికారం క్రింద విలీనం/నమోదు చేయబడింది	కంపెనీల యాక్ట్ 1956/ఆర్‌ఓసి విజయవాడ (ఎమ్‌సిఎ పోర్టల్ వద్ద అందుబాటులో ఉంది)
4.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క కార్పొరేట్ గుర్తింపు నంబర్/లిమిటెడ్ లయబిలిటీ గుర్తింపు నంబర్	U26933AP2010PTC117739
5.	కార్పొరేట్ రుణగ్రత యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా) చిరునామా	23-16-44, జైగోపాల భవన్ హరిపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్, పిన్-533105 (ఎమ్‌సిఎ పోర్టల్ వద్ద అందుబాటులో ఉంది)
6.	కార్పొరేట్ రుణగ్రతకి సంబంధించి దివాలా ప్రారంభమైన తేది	24.04.2024 (27.04.2024న ఆర్డరు కాపీ అప్‌లోడ్ చేయబడింది)
7.	దివాలా తీర్మానం ప్రక్రియ మూసివేసే అంచనా తేది	20.10.2024
8.	వృత్తిసంబంధమైన తీర్మానం మధ్యంతరంగా వ్యవహరించే వృత్తిసంబంధమైన దివాలా పేరు మరియు నమోదు సంఖ్య	నాగ భూషణ్ భగవతి Reg. No: IBBI/IPA-001/IP-P00032/2016-17/10085
9.	బోర్డ్‌తో నమోదుకాబడిన మధ్యంతర వృత్తి సంబంధమైన తీర్మానం చిరునామా మరియు ఇ-మెయిల్	నాగ భూషణ్ భగవతి హౌ.నం.1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్-500020 E-mail: bnagabhushan@yahoo.com,
10.	మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానంతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	నాగభూషణ్ భగవతి హౌ.నం.1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్-500020 E-mail: rp.karuturiceramics@gmail.com
11.	దావాలు దాఖలు చేయుటకు చివరి తేది	11.05.2024
12.	రుణదాతల తరగతులు, ఏవైనా, మధ్యంతర తీర్మానం వృత్తిసంబంధమైన వాటి ద్వారా తెలిసినవి, సెక్షన్ 21 యొక్క సబ్-సెక్షన్ (6ఎ) యొక్క క్లాస్ (బి) క్రింద	వర్తించదు
13.	క్లాస్‌లో రుణదాతల యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించి దివాలా నిపుణులుగా గుర్తించిన పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	వర్తించదు
14.	(ఎ) సంబంధిత ఫారాలు (బి) అధీకృత ప్రతినిధుల వివరాలు ప్రతినిధులు లభ్యమయ్యేది:	వెబ్ లింక్ : https://ibbi.gov.in/downloadform.html భౌతిక చిరునామా : పైన 10వ నంబరు కాలమ్‌లో ఇచ్చిన విధంగా

24.04.2024న (27.04.2024న ఆర్డరు కాపీ అప్‌లోడ్ చేయబడింది) మెసెర్స్.కరుతూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌ను ప్రారంభించాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్, అమరావతి ఆదేశించినట్లు నోటీసు ఇవ్వబడింది.
మెసెర్స్. కరుతూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణదాతలను ఇక్కడ పిలువడమేమనగా ఎంట్రీ నం.10కి ఎదురుగా ఉండి చిరునామాగా పేర్కొన్న ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫిషనల్‌కు 11.05.2024న లేదా ముందే వారి దావాల రుజువులను దాఖలు చేయుటకు కోరడమైనది.
ఆర్థిక రుణదాతలు తమ క్లెయిమ్‌లను ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా మాత్రమే రుజువుతో సమర్పించాలి. ఇతర రుణదాతలు వ్యక్తిగతంగా, పోస్ట్ ద్వారా ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా రుజువుతో క్లెయిమ్‌లను సమర్పించవచ్చు.
ఎంట్రీ నం. 12కి వ్యతిరేకంగా జాబితా చేయబడిన ఒక తరగతికి చెందిన ఆర్థిక రుణదాత, ఎంట్రీ నం.13కి వ్యతిరేకంగా జాబితా చేయబడిన ముగ్గురు దివాలా నిపుణుల నుండి అధీకృత ప్రతినిధి ఫారమ్ సిఎలో తరగతి (వర్తించదు)కి అధీకృత ప్రతినిధిగా దాని ఎంపికను సూచిస్తుంది.
క్లెయిమ్ యొక్క తప్పుడు లేదా తప్పుదారి పట్టించే రుజువులను సమర్పిస్తే జరిమానాలు విధించబడతాయి.

సం/- ఇంటరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషినల్ నాగభూషణ్ భగవతి
సంతకం మరియు పేరు
ఇంటరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్
మెసెర్స్ కరుతూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్

తేది: 27.04.2024
ప్రదేశం : హైదరాబాద్

పొలిటికల్ 'స్క్రీన్'

సృజనాత్మకతతో తెరకెక్కిన చలనచిత్రాలు వీక్షకుల భావోద్వేగాలను ప్రభావితం చేస్తాయి. హృదయాలను హత్తుకుంటాయి. సందేశాత్మకంగా నిలుస్తాయి. స్వాతంత్ర్యానంతరం వచ్చిన సినిమాలు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ విలువలను బహిరంగంగా ఆమోదించాయి. వామపక్షాల సైద్ధాంతిక ధోరణికి దగ్గరగా ఉన్న కథనాలతో తెరకెక్కిన పలు చిత్రాలు ప్రజల ఆదరణ పొందాయి. ఈ చిత్రాలలో ఏదీ చరిత్రను వక్రీకరించలేదు. వాస్తవాలకు విరుద్ధంగా హిస్టరీని తిరగరాయనూలేదు. నిజాన్ని తప్పుగా పేర్కొనలేదు. ప్రస్తుతం పలు భాషల్లో ఉద్దేశపూర్వకంగా తెరకెక్కిస్తున్న కొన్ని సినిమాలు అందుకు పూర్తి భిన్నం. మత విద్వేషాల వ్యాప్తికి, రాజకీయ ప్రత్యర్థులపై కువిమర్శలకు, సైద్ధాంతిక దాడిని ఎక్కుపెట్టాయి.

భారతీయ చలన చిత్రాలను ప్రజల్లో సామరస్యం, బహుళ సంస్కృతుల మేళవింపు, జాతీయత, లౌకికత్వం పెంపొందించే దిశగా నిర్మించేవారు. అటు నాయకులకు ఇటు ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేవి. ఇటీవల మోడీ ప్రభుత్వ హయాంలో విడుదలైన కొన్ని చిత్రాలు మతపరమైన విభేదాలకు తావిచ్చాయి. మితవాద రాజకీయాలను, బిజెపి ప్రభుత్వ విధానాలను ఆమోదించే, ప్రచారం కల్పించే సినిమాలు అకస్మాత్తుగా పెరిగాయి. మోడీ హిందుత్వవాదాన్ని తెలిపే పది చిత్రాలు ఎన్నికల ముందు రిలీజయ్యాయి. ఆర్టికల్ 370, బస్తర్-నక్సల్ స్టోరీ, స్వతంత్ర వీర్ సావర్కర్, రజాకార్, యాక్సిడెంట్ ఆర్ కాన్స్పిరసీ -గోద్రా, జెఎన్‌యు-జహంగీర్ నేషనల్ యూనివర్శిటీ, ద సబర్మతి రిపోర్ట్ వంటి చిత్రాలు విడుదలయ్యాయి. ఇలాంటి చిత్రాలు ప్రేరేపిత రాజకీయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాక వాస్తవాలను వక్రీకరించే విధంగా ఉన్నాయి.

లెఫ్ట్ పార్టీలపై దాడి..

ముస్లింలను రెచ్చగొట్టేలా తెరకెక్కిన 'కాశ్మీర్ ఫైల్స్' చిత్రం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేరళకు చెందిన 32 వేల మంది హిందూ, క్రైస్తవ మహిళలు ఇస్లాం మతం స్వీకరించి ఐఎస్ఐఎస్‌లో చేరారని, కేరళ ఇస్లామిక్ రాష్ట్రంగా మారిందని తప్పుడు ప్రచారంతో కుట్ర సిద్ధాంతాలతో లెఫ్ట్ పార్టీలకు, అక్కడి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'కేరళస్టోరీ' చిత్రాన్ని తెరకెక్కించారు. బస్తర్ నక్సల్ స్టోరీని తెరకెక్కించిన దర్శకుడే 'కేరళ స్టోరీ'ని తీశాడు. రజాకార్లు యూనియన్ సైన్యంపై తిరగబడలేదు. వారూ నిజాంలాగే లొంగిపోయారంటూ అవాస్తవాలను జోడించి తెలుగులో 'రజాకార్' చిత్రాన్ని తెరకెక్కించారు.

ప్రాంతీయ వ్యూహం..

దక్షిణాదిలో రాజకీయాల్లోకి వచ్చిన నటుల్లో ఎన్‌టి రామారావు అందరి దృష్టి ఆకర్షించారు. 1980 దశకంలో తెలుగునాట ఆయన సినిమాలను ప్రజలు ఆదరించారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపిల మధ్య రాజకీయ పోరులో భాగంగా తాజాగా కొన్ని చిత్రాలు విడుదలయ్యాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి అధికారంలోకి ఎలా వచ్చారో తెలిపే చిత్రం యాత్ర-2. రాజధాని అమరావతి నేపథ్యంలో వైసిపి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా 'అమరావతి ఫైల్స్', వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కథాంశంగా వచ్చిన 'వివేకం' మువీ, టిడిపి నేతల కథాంశంతో ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ 'వ్యూహం', 'శపథం' అనే చిత్రాలను తెరకెక్కించారు. వాటిలో చాలామట్టుకు కోర్టుల వరకు వెళ్లాయి. ఇక పవన్‌కళ్యాణ్ నటించిన 'బ్రో' మువీలో మంత్రి అంబటి రాంబాబు క్యారెక్టర్‌ను ఇమిటేట్ చేస్తూ కొన్ని సెకన్ల సీన్స్ పెట్టారని రాజకీయంగా వివాదాస్పదమైంది.



- ఎలక్షన్ డెస్క్

- నాలుగు దశల్లో లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలు
- కేంద్రంలో దోస్తీ.. రాష్ట్రంలో కుస్తీ
- ఇదీ ఒడిశాలో బిజెడి, బిజెపి వ్యవహారం
- ఈ మారు డైరెక్టు పొత్తు కోసం ప్రయత్నించి వెనక్కి
- ఆ రెండు పార్టీలతో తలపడుతున్న కాంగ్రెస్
- ఒక ఎంపి, ఏడు ఎంఎల్‌ఎ స్థానాల్లో సిపిఎం పోటీ

ఉత్కళ సీమలో ఊపెవరిది?

(జె.జగదీష్)

ఒడిశాలో సుదీర్ఘకాలంగా నవీన్ పట్నాయక్ సారధ్యంలోని బిజెడి పాలన కొనసాగుతోంది. ఈ తడవ బిజెడి పట్టు కాస్త సడలినట్లు కనిపిస్తున్నప్పటికీ నవీన్ పట్నాయక్ చేయి దాటి పోయినట్లు కాదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ఇటీవల కొందరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేయడం బిజెడికి కొంత నష్టమని చెప్పొచ్చు. మరోవైపు బిజెపి కేంద్రీకరించి పని చేస్తోంది. 2014లో ఒక ఎంపి గెలిచిన బిజెపి, 2019లో ఎనిమిది స్థానాలకు పెరిగింది. కాంగ్రెస్ తన పట్టు సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. 2014లో యుపిఎ ఖాతా తెరవలేదు. 2019లో కాంగ్రెస్ ఒక సీటు గెలుచుకుంది. బిజెపి, బిజెడిలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ఎదుగుతోందని అంటున్నారు. కానీ ఆ రెండు పార్టీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఏ మేరకు ఓట్ల రూపంలో తన వైపు మరల్చుకుంటుందో చూడాలి. మొత్తంగా ఒడిశాలో త్రిముఖ పోటీ నెలకొంది.

బిజెపితో పొత్తుపై వెనుకడుగు

దేశంలోనే సుదీర్ఘ కాలం పాటు సిఎంగా పనిచేసిన వారిలో నవీన్ పట్నాయక్ రెండవ స్థానంలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి మళ్లీ అధికారాన్ని చేపడితే నెంబర్ 1 స్థానానికి చేరుకుంటారు. ఈ సారి గెలిచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకే తొలిత బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి చర్చలు జరిపారు. సీట్ల సర్దుబాట్లలో కుదరకపోవడం, మరికొన్ని కారణాల వలన ఒంటరిగా వెళ్తున్నారు.

బిజెపికి సహకరిస్తున్న బిజెడి

సార్వత్రిక ఎన్నికల్లో దేశమంతా ఒక పరిస్థితి ఉంటే ఒడిశాలో మాత్రం విభిన్న రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటే ఇక్కడ మాత్రం స్నేహపూర్వక పోటీ నెలకొన్నది. 1998 నుంచి 2009 వరకు బిజెడి, బిజెపి అన్ని ఎన్నికల్లో కలిసే పోటీ చేశాయి. తొలి వాజపేయి సర్కారులో నవీన్ పట్నాయక్ కేంద్రమంత్రిగా పనిచేశారు. 2009 నుంచి విడిపోయినా గత పదేళ్లగా కేంద్రంలోని మోడీ సర్కారుకు బిజెడి అన్ని అంశాల్లో, బిల్లులపై మద్దతిస్తోంది. ఈ రెండు ఫ్రెండ్లీ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉండగా.. వీటిపై ఉన్న వ్యతిరేకతనే ఆయుధంగా కాంగ్రెస్ బరిలో నిలుస్తున్నది.

ఎవరి బలమెంత?

ఒడిశాలో 21 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో.. బిజెడి 12 సీట్లల్లో, బిజెపి 8 చోట్ల, కాంగ్రెస్ ఒక సీటు గెలిచాయి. 147 అసెంబ్లీ స్థానాల్లో బిజెడి 112, బిజెపి 23, కాంగ్రెస్ ఎనిమిది, సిపిఎం 1 స్థానంలో గెలిచాయి. ప్రస్తుత ఎన్నికల్లో బిజెడి, బిజెపి, కాంగ్రెస్, సిపిఎం ఒక ఎంపి, ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది.

మన్మత్ రాత్రే

సురేష్ చంద్ర రాత్రే

కుమారుల పోటీ... తండ్రులకు పాట్లు

ఒడిశా రాజకీయాల్లో తమ కుమారుల విజయం కోసం ఇద్దరు తండ్రులు తపన పడుతున్నారు. తండ్రులు ఒకపార్టీలో ఉంటే.. కుమారులు మరో పార్టీలో పోటీ చేస్తున్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ సీనియర్ సురేష్ చంద్ర రౌత్రేకి కాంగ్రెస్ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. ఖాతరు చేయని రౌత్రే, బిజెపి నుంచి భువనేశ్వర్‌లో పోటీ చేస్తున్న తనయుడు మన్మత్ రౌత్రే గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, బిజెపి నేత మోహపాత్రది కూడా అదే పరిస్థితి. పట్కురా అసెంబ్లీ నుంచి బిజెడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు అరబింద మోహపాత్ర గెలుపు కోసం శ్రమిస్తున్నారు.

అరబింద మోహపాత్ర

మోహపాత్ర

మూడవ తడవ అధికారం కోసం

మోడీ మూర్ఖపు ప్రవర్తన

ఒక ఇంటర్వ్యూలో శరద్ పవార్

పూణె : కేంద్రంలో మూడవ తడవ బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రధాని మోడీ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని ఇండియా బ్లాక్‌లో భాగస్వామ్య పార్టీ అయిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్ శరద్‌పవార్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో విమర్శించారు. ముస్లింల లక్ష్యంతో మోడీ చేస్తున్న విద్వేష వ్యాఖ్యల్ని ఖండించారు.

గత రెండు ఎన్నికల కంటే ఈ ఎన్నికలు ఎలా భిన్నంగా ఉన్నాయి?

ఈ ఎన్నికలు క్రికెట్ గేమ్‌ని తలపిస్తున్నాయి. క్రికెట్ గేమ్‌లో మాదిరిగానే ఎప్పుడైనా, ఎక్కడైనా పట్టుకొని అవుట్ చేసే అవకాశం ఉంది. ఈ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ చేసే ప్రసంగాల్లో అభివృద్ధి ఊసే లేదు. అభివృద్ధి, సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక దేశ ప్రధాని మహిళల మంగళసూత్రాలు, హిందువులు- ముస్లింల గురించి ఎలా మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు. ఇది జాతీయ సమస్యా?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు పంచిపెడతారన్నారు? ఈ సంపద పునఃపంపిణీ ఆలోచనపై మీ అభిప్రాయం ఏమిటి?

అసలు ఇదొక అంశంగా నేను భావించడం లేదు. ఇది మూర్ఖపు పని, పిచ్చిపని అని అందరికీ తెలుసు. ఈ సమయంలో దేశ ప్రజానీకం చర్చించే విధంగా లేవనెత్తాల్సిన విషయం కాదు. దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమ్యలున్నాయి. ప్రధాని ఈ సంక్షోభాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు సంపద పునర్విభజన గురించి మాట్లాడుతున్నాడు.

మీరు విడుదల చేసిన మ్యానిఫెస్టోలో కులగుణన, రిజర్వేషన్ల పరిధిని విస్తరింపజేయడం గురించి మాట్లాడారు? ఇవి అమలు సాధ్యమేనా?

వెనుకబడిన కులాల గురించి సమాచారాన్ని సేకరించి క్రోడీకరించేంత వరకు మేము వారి సమస్యల్ని పరిష్కరించలేము. ఉదాహరణకు మరాఠా రిజర్వేషన్ అంశాన్నే తీసుకోండి. రాష్ట్రంలో ఓబిసిలకు నిర్దిష్ట మినహాయింపులు లభిస్తాయి. కానీ మరాఠాలు వాటిని మహారాష్ట్ర అంతటా ఒకేవిధంగా పొందరు. విదర్భలోని నా బంధువులు కుంబీలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతారు. మరాఠాగా నాకు పూణెలో రిజర్వేషన్ ప్రయోజనాలు లభించవు. అందుకే రిజర్వేషన్ల పరిధిని పెంచడం గురించి ఆలోచన ఉంది. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం ఉంది.రైతుల భూములు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. వారి మనుగడ కష్టంగా ఉంది. వారికి ఏదో ఒకవిధంగా ప్రయోజనం చేకూర్చడానికే రిజర్వేషన్లు.

బారామతి పోటీని మీరు ఎలా చూస్తున్నారు?

సుప్రియా సూలేను ఓడించేందుకు కేంద్ర ప్రభుత్వం తన పూర్తి శక్తిని ఉపయోగిస్తోంది. డబ్బు ప్రభావం కూడా ఎక్కువగా ఉంది. అన్ని ఏజెన్సీలు చురుకుగానే ఉన్నాయి. మరి ఎలా ఉండబోతుందో చూడాలి.

మీరు ఎప్పుడైనా అజిత్ పవార్‌తో సయోధ్య గురించి ఆలోచిస్తారా?

అజిత్, నరేంద్ర మోడీ బిజెపిలో ఉన్నంత కాలం అది జరగదు.



దేశ ఐటి హబ్ బెంగళూరులో అతి తక్కువ పోలింగ్

బెంగళూరు : రెండోదశ పోలింగ్ శుక్రవారం ముగిసింది. ఈ దశలో 88 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. కర్ణాటకలో 14 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దేశంలోనే ఐ.టి. హబ్‌గా పేరొందిన బెంగళూరులో అతి తక్కువ పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం వెల్లడించింది. బెంగళూరు సౌత్, బెంగళూర్ సెంట్రల్, బెంగళూర్ నార్త్ స్థానాల్లో అతి తక్కువ ఓటింగ్ నమోదైంది. బెంగళూరు సెంట్రల్‌లో సుమారు 52.81 శాతం, బెంగళూరు నార్త్‌లో 54.42 శాతం, బెంగళూరు సౌత్‌లో 53.15 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలకన్నా ఈసారి జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాలేకపోయారని అధికారులు తెలిపారు. మరోవైపు బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 67.29 శాతం ఓటింగ్ నమోదైంది. మాండ్యాలో 81.48 శాతం, కోలార్‌లో 78.07 శాతం పోలింగ్ నమోదైంది. బెంగళూరులో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఇ.సి. అనేక కార్యక్రమాలు నిర్వహించింది.ఓటరు స్లిప్‌లలో క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. దీనిని స్కాన్ చేయడం ద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్ చిరునామాను సులభంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. పోలింగ్ బూత్‌ల వద్ద పార్కింగ్ సదుపాయాన్ని కూడా ఇసి కల్పించింది. ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఓటరు హెల్ప్‌లైన్, 'నో యువర్ క్యాండిడేట్' యాప్‌లను ఇసి అందుబాటులో ఉంచింది.

కలం బాణాలు

రైల్వే జోన్‌కు స్థలంపై కేంద్ర మంత్రి అబద్ధం చెప్పారు : బొత్స

జోనే ఇవ్వని కేంద్రం
స్థలంపైన నెపమా?
హొదా, లోటూ, నిధులు
ఇచ్చిందేం చెప్పుమా?

మోడీ జీ తల్చుకుంటే
ఇదో పెద్ద సవాలా?
ఇచ్చామంటూ బొత్స
చెప్పేవే నిజాలా?

నన్ను అంతమొందించేందుకు కుట్ర వి.వి లక్ష్మీనారాయణ

సిబిఐ టాపుక్యాపు
ప్రాణాలకు ముప్పా?
ఎలక్షన్ల వేడిలోన
ఇదోకొత్త నిప్పా?

నేతలనే ఆడించిన
గనుల గాలి రెడ్డి
అధికారులదేమున్నది
రాజకీయ మడ్డి

హిందూ ముస్లిం గొడవ
ఆపరేమి ప్రధాని
దేశనేత నోట రోజు
మతోన్మాద కహానీ

మానవత్వమే ముఖ్యం
వద్దండి కుటిలనీతి
విశాల భారతదేశం
ఆలపించె ఐక్యగీత

- తె.ర

కాంగ్రెస్ మేనిఫెస్టోలో హిందువులకు అన్యాయం : మోడీ

ముక్కోణపు పోటీలో గెలుపెవరిదో

- ఎట్టకేలకు టిడిపిలో ఐక్యత
- సిపిఎంకు పెరుగుతున్న ఆదరణ వైసిపి ఎదురీత
- కురుపాం నియోజకవర్గం పరిస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో గెలిచేదెవరు? ఎట్టకేలకు టిడిపిలో ఏర్పడిన ఐక్యతారాగం నిలుస్తుందా? పెరుగుతున్న ఆదరణతో సిపిఎం మరోసారి విజయం వరకు దారి తీస్తుందా? ఇలా ఈ రెండు పార్టీలూ పుంజుకుంటే వైసిపికి ఎదురీత తప్పదా? ఇది ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగుతున్న చర్చ. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గం నుంచి వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి, టిడిపి తరపున తోయక జగదీశ్వరి, ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అభ్యర్థిగా మండంగి రమణ బరిలో నిలిచారు. ఎస్టీ రిజర్వుగావున్న ఈ నియోజకవర్గంలో పుష్పశ్రీవాణి గతంలో వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. ప్రస్తుతం టిడిపిలోని గ్రూపులన్నీ ఏకతాటిపైకి వచ్చి ఐక్యతా రాగం తీయడంతో పుష్పశ్రీవాణి మద్దతుదారుల్లో గుబులు పెరిగింది. గ త ఎన్నికల్లో గెలిచాక డిప్యూటీ సిఎం స్థాయి వరకు పుష్పశ్రీవాణి ఎదిగినప్పటికీ ఎన్నికల ముందు, ఆ తరువాత ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదు. ఏజెన్సీలో గెడ్డల(వాగు)పై కల్వర్టులు, ఏనుగుల తరలింపు, జీడిపరిశోధనా కేంద్రం ఏర్పాటు, చేపల ఉత్పత్తి కేంద్రం బలోపేతం తదితర అంశాలపై ఇచ్చిన హామీలు నెరవేరలేదు. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయలేకపోయారు. తోటపల్లి నిర్వాసితులకు న్యాయం చేయలేకపోయారు. దీనికితోడు డిప్యూటీ సిఎంగా హోదా పెరిగిన తరువాత జనాలకు కాస్త దూరంగా ఉన్నారు. దాంతో దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం, వ్యతిరేకత పెరిగాయి. మరోవైపు ఆమె వైఖరిని భరించలేక సొంత పార్టీకి చెందిన జియ్యమ్మవలస ఎంపిపి బుంగ సురేష్ కొంతమంది ఎంపిటిసి సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం బొబ్బిలి వచ్చిన చంద్రబాబు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇలా చాలాకాలంగా ఆమె వైఖరిపట్ల తీవ్ర సంతృప్తితోవున్నవారు ప్రస్తుతం పార్టీలో అంత క్రియాశీలకంగా పనిచేయడం లేదు.

జగదీశ్వరి

పుష్పా శ్రీవాణి

ఇటు రెండు నెలల క్రితం వరకు గ్రూపు భేదాలతో చుక్కాని లేని నావలా ఉన్న టిడిపిలో ఐక్యత కోసం మాజీ ఎంపి ప్రదీప్ చంద్రదేవ్ కుమారుడు వీరేష్ చంద్రదేవ్ చొరవ చేశారు. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో టిడిపి తరపున ఐదుగురు గిరిజనులు సీట్లు ఆశించారు. జగదీశ్వరికి ఇచ్చాక వీరంతా ఎవరికివారే కినుక వహించారు. గిరిజనేతరుడైన దత్తి లక్ష్మణరావు కూడా మరో బలమైన గ్రూపును నడుపుతూ వచ్చారు. ఇటీవలే పార్టీ అధిష్టానం వీరేష్‌ను రంగంలోకి దింపింది. ఈయన వీరందర్నీ ఎట్టకేలకు ఒక్కటి చేసి ఒకే వేదికపై తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో ఆ పార్టీలు ముందుకు సాగుతోంది. మరోవైపు సిపిఎం అభ్యర్థి మండంగి రమణకు ప్రజాదరణ పెరిగింది. టిడిపి, వైసిపిలకు ధీటుగా సిపిఎం ప్రచారం సాగుతోంది. రమణ గిరిజన సమస్యలపై చేసిన పోరాటాలు, మంచివాడనే భావన సానుకూల అంశాలుగా ఉన్నాయి. ఎల్విన్‌పేట సర్పంచిగా, ఎంపిటిసి సభ్యుడిగా నిజాయితీగా వ్యవహరించడం, ప్రజలకు తలలో నాలుకలా వుండడం అందరూ గుర్తు చేసుకుంటున్నారు. మాజీ కేంద్ర మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించడంతో రమణకు అనుకూల వాతావరణం ఏర్పడింది. గిరిజన సంఘం నాయకుడిగా ఏజెన్సీ వ్యాప్తంగా సుపరిచితుడు. నాటి నాగూరు కేంద్రంగావున్న నేటి కురుపాం నియోజకవర్గంలో 2004లో సిపిఎం విజయకేతనం ఎగరవేసిన విషయం విదితమే. అప్పట్లో అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేసిన చరిత్ర ఉంది. దీనికితోడు ఇండియా వేదికలోని సిపిఐ, సిపిఐ ఎంఎల్, లిబరేషన్, కాంగ్రెస్ తదితర పార్టీలు రమణకు అండగా ఉన్నాయి. ఈనేపథ్యంలో కురుపాంలో ముక్కోణపు పోటీ నెలకొంది. రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎవరిని విజయతీరాలకు చేర్చుతాయో వేచి చూడాల్సిందే!

మండంగి రమణ

నామినేషన్లు తిరస్కరణ

ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిశీలన ప్రక్రియ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 శాసనసభ స్థానాలకు సంబంధించి 939 నామినేషన్లు తిరస్కరించి, 2,705 నామినేషన్లను ఆమోదించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. అదే విధంగా 25 పార్లమెంటు స్థానాలకు సంబంధించి 503 నామినేషన్లు ఆమోదించి, 183 నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనసభ స్థానాలకు సంబంధించి అత్యధికంగా తిరుపతికి 52 నామినేషన్లు, అత్యల్పంగా చోడవరంకు 8 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. పరిశీలన అనంతకరం తిరుపతిలో 48 నామినేషన్లు, చోడవరంలో 6 నామినేషన్లను ఆమోదించినట్లు చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29వరకు అవకాశం ఉందని తెలిపారు.

ఇప్పటికీ కేరాఫ్ హైదరాబాదే !

- కార్యాలయాల చిరునామా మార్చుకోని వైఎస్ఆర్‌సిపి, టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార వైఎస్ఆర్‌సిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి ఇప్పటికీ తమ ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్‌లోనే నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్‌లో వెల్లడయింది. రాష్ట్ర పార్టీల వివరాలతో కూడిన జాబితాలను ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. ఇసి విడుదల చేసిన గెజిట్‌లో ఆయా పార్టీల వివరాలు, గుర్తు, ప్రధాన కార్యాలయాల చిరునామాలు ఉంటాయి. ఆ వివరాల ప్రకారం.. వైఎస్ఆర్‌సిపి ప్రధాన కార్యాలయంగా హౌస్ నెంబరు 8-2-269/ఎస్/98, సాగర్ సొసైటీ, రోడ్ నెంబరు-2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, అలాగే టిడిపి ప్రధాన కార్యాలయంగా ఎన్‌టిఆర్ భవన్, రోడ్ నెంబరు-2, బంజారాహిల్స్, హైదరాబాద్ 500033 చిరునామాలను పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ పార్టీల జాబితాలో 1217వ స్థానంలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం చిరునామాను మంగళగిరిలోని లక్ష్మీనరసింహ కాలనీగా పేర్కొన్నారు. ప్రస్తుతం వైసిపి ప్రధాన కార్యాలయం తాడేపల్లిలోనూ, అలాగే టిడిపి ప్రధాన కార్యాలయాన్ని మంగళగిరిలోనూ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. చిరునామాలు మార్చుకోకపోవడంతో హైదరాబాద్‌లోనే వీటి ప్రధాన కార్యాలయాలు ఉన్నట్లుగా పేర్కొన్నారు.

రాజంపేట కూటమిలో అసమ్మతి సెగ

కిరణ్‌కుమార్‌రెడ్డికి టిడిపి ఓట్ల బదలాయింపుపై సందేహాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున బిజెపి అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసిపి అభ్యర్థిగా ప్రస్తుత ఎంపి. పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి ఎస్‌కె బాసిత్ ప్రధాన పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, పీలేరు మదనపల్లి, తంబళ్లపల్లి, చిత్తూరు జిల్లాకు చెందిన పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 16,39,905 మంది ఓటర్లు ఉన్నారు.

మిథున్ రెడ్డి

బాషిత్

దీని పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు టిడిపి అభ్యర్థుల ఎంపికలు చాలావరకూ వివాదస్పదంగా మారాయి. ఈ కారణంగానే రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి ఆ పార్టీని వీడి వైసిపిలో చేరిపోయారు. రాజంపేట అసెంబ్లీ టికెట్‌ను ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడును కాదని, స్థాని కేతరుడైన సుగవాసి సుబ్రమణ్యంకు టికెట్ ఖరారు చేశారు. బత్యాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌కు టికెట్ రాకపోవడంతో అభ్యర్థి జయ చంద్రారెడ్డికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. మదనపల్లి టికెట్ మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే డి రమేష్ అసంతృప్తితో ఉన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డికి టిడిపి శ్రేణుల ఓట్ల బదలాయింపు పరిస్థితిపై రాజకీయ విశ్లేషకులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఓట్ల బదిలీ అనుమానమే!

2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ బరిలో నిలిచిన ప్రస్తుత బిజెపి అధ్యక్షులు పురంధేశ్వరి దారుణ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితి పునరావృతం కారాదనే ఉద్దేశంతో కూటమి నాయకత్వం ఆర్థిక, అంగ, అనుచర బలగం కలిగిన కిరణ్‌కుమార్‌రెడ్డిని బరిలో నిలిపింది. అయితే ఆచరణలో కూటమి ఆశలు ఫలించేలా కనిపించడం లేదు. బిజెపి అభ్యర్థి గుర్తు కమలానికి టిడిపి ఓట్ల బదిలీ గుదిబండగా మారనుంది. టిడిపి వీరాభిమానులు, వృద్ధుల ఓట్లు సుమారు 5-10 శాతం మేర బదిలీ కావడం కష్టమనే విశ్లేషణ వినిపిస్తోంది.

కాంగ్రెస్ వేదికకు గణనీయంగా మైనార్టీల ఓట్లు

మదనపల్లి, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో మైనార్టీలు గణనీయ సంఖ్యలో ఉన్నారు. మైనార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతారనే అంశం ఆసక్తిని కలిగిస్తోంది. కేంద్రంలోని బిజెపి నాయకత్వం మైనార్టీల పట్ల వ్యవహరిస్తున్న తీరు ఈ ఆందోళనకు కారణమని తెలుస్తోంది. ఇండియా వేదికలో వామపక్షాలు కీలకపాత్ర పోషిస్తుండడం, వైఎస్ షర్మిల పిసిసి పగ్గాలు చేపట్టడం కాంగ్రెస్‌లో కొత్త ఆశలు రేపుతోంది. ఇటువంటి సానుకూల పరిస్థితుల్లో మైనార్టీ ఓట్లను కాంగ్రెస్ గణనీయ సంఖ్యలో రాబట్టే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

టిడిపి కొంపముంచనున్న బిజెపి ప్రకటనలు

- ముస్లిం రిజర్వేషన్లపై విచిత్ర వైఖరి
- ఖండించని టిడిపి, జనసేన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముస్లిం రిజర్వేషన్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి, బిజెపి నాయకులు పియూష్ గోయల్ విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. అసలు అవి రిజర్వేషన్లు కావనే విధంగా ప్రకటించారు. దీంతో బిజెపితో పొత్తుపెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్లిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది.

మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకెళుతున్న బిజెపి దానిలో భాగంగానే రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు వీలుగా రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇతర కులాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిందనే విమర్శలూ ఉన్నాయి. కేంద్రమంత్రి ప్రకటనతో రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీలలో తీవ్ర ఆందోళన మొదలైంది. దీనికితోడు ముస్లిములు అధికంగా ఉన్న ఒకటీ రెండు నియోజకవర్గాల్లో నేరుగా బిజెపి నేతలు రంగంలోకి దిగారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఏజెన్సీలోనూ ఎంపి అభ్యర్థిగా బిజెపి నాయకులను దింపారు. ఈ నేపథ్యంలో ముస్లింలు, గిరిజనుల్లో తీవ్ర అభద్రతా భావం ఏర్పడింది. అలాగే సిఎఎ అమలుపై ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. అతేకాదు, తాము తిరిగి కేంద్రంలో అధికారంలోకొస్తే సిఎఎను అమలు చేసి తీరతామని అమిత్‌షా వంటి వారు కుండబద్దలు కొడుతున్నారు. ఇది టిడిపి, జనసేన పార్టీలకు మైనార్టీల ఓటర్లను దూరం చేయనుందనే అభిప్రాయం టిడిపి సీనియర్ నేతల్లో వ్యక్తమవుతోంది. బిజెపి ప్రకటనల వల్ల మైనార్టీల నుండి రావాల్సిన ఓట్లు రావని కొంతమంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాయకుల్లోనే ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది.


చంద్రబాబు నాయుడు


పియూష్ గోయల్

చాలా సీట్లపై ప్రభావం

రాష్ట్రంలో విజయవాడ పశ్చిమ, గుంటూరు ఈస్ట్, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కర్నూలు, కడప, అనంతపురం అర్బన్, నంద్యాల, ఆదోని, మదనపల్లి, ప్రొద్దుటూరు, చిత్తూరు, తెనాలి, పొన్నూరు, మచిలీపట్నం, ఒంగోలు, హిందూపురం, గుంతకల్లు, కదిరి, రాయచోటి, నరసరావుపేట, కావలి, చిలకలూరిపేట, ధర్మవరం, ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో ముస్లిములు పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు.

చాలా నియోజకవర్గాల్లో కనీసం 20 వేలకు పైబడి ముస్లిం ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం 36,17,713 మంది ముస్లిములు ఉన్నారు. ఇప్పుడు వారంతా బిజెపి విద్వేష ప్రకటనలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట నెగ్గించుకునే ప్రయత్నం

బిజెపి నాయకులు ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించడం వెనుక పెద్ద ఎత్తున పార్టీ పథక రచన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ బిజెపి నాయకులు చెబితే పట్టించుకునేవారు లేరు. ఇప్పుడు టిడిపి నాయకులు కూడా కచ్చితంగా వారేమి చెబుతున్నారో వినాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నికల తర్వాత ఒకవేళ తమ ప్రభుత్వం ఏర్పడితే తాము చేసిన ముస్లిం రిజర్వేషన్ల వ్యతిరేక ప్రకటన అంశమే తమకు ఓట్లు తెచ్చిపెట్టిందని ప్రచారం చేసుకుని మతోన్మాద భావజాలాన్ని మరింత విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లేందుకు తమకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతోనే బిజెపి నాయకులు రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైసిపి మ్యానిఫెస్టోలో పాత హామీలే!

- విశాఖ ఉక్కు ఊసు లేదు
- కొన్ని పథకాలకు స్వల్పంగా నిధులు పెంపు
- ప్రత్యేక హోదాపై పాతపాటే
- నాలుగేళ్ల తరువాత పింఛను పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి మ్యానిఫెస్టోలో పాత పథకాలనే వల్లె వేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శనివారం ఆవిష్కరించిన ఈ మ్యానిఫెస్టోలో విశాఖ ఉక్కును పూర్తిగా విస్మరించారు. పోరాడుతున్న కార్మికులకు మద్దతు తెలపడం గానీ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కృషి చేస్తామన్న హామీ కూడా ఇవ్వలేదు. కొద్దిరోజుల క్రితం ఉక్కు ఫ్యాక్టరీ కార్మికసంఘాలతో ముఖ్యమంత్రి భేటీ అయిన సందర్భంలోనూ ఇదే విధమైన వైఖరి అవలంబించిన విషయం తెలిసిందే. తాజాగా మ్యానిఫెస్టోలోనూ మౌనం వహించడం గమనార్హం. రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రత్యేకహోదా విషయంలోనూ వైసిపి దాటవేత వైఖరి అవలంభించింది. ఇప్పటిదాకా అనేక సందర్భాల్లో చెబుతున్నట్లే మరో ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఆందోళన ఉంటుందని పేర్కొన్నారు. కొన్ని సంక్షేమ పథకాల్లో నిధులు స్వల్పంగా నిధులను పెంచినట్లు ప్రకటించినా పెరిగిన ధరల నేపథ్యంలో దానివల్ల ఒరిగేదేమీ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాత పథకాలను వివరించడం తప్ప కొత్త అంశాలేవీ పెద్దగా పొందుపరచలేదు. పింఛన్లను నాలుగేళ్ల తరువాత 500 రూపాయలు పెంచుతామని చెప్పారు. జనవరి 2028లో 250 రూపాయలు పెంచి ఇస్తామని, జనవరి 2029లో మరో రూ.250 పెంచి రూ. 3,500 చేస్తామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును 2021 నాటికి పూర్తి చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. మరలా ఇప్పుడు మరో ఐదేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ మ్యానిఫెస్టోలో నిర్వాసిత గిరిజనుల పునరావాసం అంశాన్ని మాత్రం చేర్చలేదు. గత మ్యానిఫెస్టోలో రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని చెప్పినా తాజా మ్యానిఫెస్టోలో ఆ అంశానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. కేవలం రైతులకు ఇచ్చే భరోసా అంశాన్ని మాత్రమే ప్రస్తావించారు.

ఇద్దరు బడా వ్యాపారుల మధ్య మాజీ ఐఎఎస్

ఉత్కంఠ రేపుతున్న నెల్లూరు ఎంపి ఎన్నిక

ప్రజాశక్తి
నెల్లూరు ప్రతినిధి

సింహపురిలో 2024 సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి టిడిపి నుంచి పెద్ద కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నుంచి ప్రముఖ వ్యాపారవేత్త వేణుంబాక విజయసాయిరెడ్డి, ఇండియా బ్లాక్ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జిల్లా పూర్వ కలెక్టర్ కొప్పోలు రాజు ప్రధాన పోటీలో ఉండడంతో ముగ్గురి మధ్య ఆసక్తిర పోరు సాగుతోంది.

రెండు నెలల క్రితం వైసిపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ప్రకటించడంతో ఆయన ప్రచారం ప్రారంభించారు. అయితే జిల్లాలో ఎమ్మెల్యేల ఎంపికకు సంబంధించి తనను సంప్రదించలేదనే కారణంతో వేమిరెడ్డి ...జగన్ పట్ల, వైసిపి పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ..సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ద్వారా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కబురు చేశారు. ఈ పరిణామాల అనంతరం వేమిరెడ్డి... వైసిపిలో పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి టిడిపిలో చేరిపోవడం, ఎంపి టికెట్‌తో పాటు ప్రభాకరరెడ్డి భార్య ప్రశాంత్‌రెడ్డికి కోవూరు అసెంబ్లీ స్థానం దక్కడం వెంట. వెంటనే జరిగిపోయాయి. దీంతో వేమిరెడ్డిని ఓడించడానికి గత ఏడాదే రాజ్యసభకు ఎంపికైన వేణుంబాక విజయసాయిరెడ్డిని జగన్ రంగంలోకి దింపారు.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం తాళ్లపూడి వాసి, ఆర్థికంగా బాగా స్థిరపడిన విజయసాయిరెడ్డి ప్రస్తుతం ఆ పార్టీలో రెండో స్థానంలో ఉన్నారు. టిడిపి, వైసిపి అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల్లో గ్రూపులను ఏకం చేసి తమ విజయానికి ఇబ్బంది లేకుండా వేమిరెడ్డి, విజయసాయిరెడ్డి ప్రయత్నిస్తున్నారు.

కె. రాజు


వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

విజయసాయి రెడ్డి

ఇద్దరు బడా నేతలు నువ్వా, నేనా అన్నట్లు ఉన్న పరిస్థితుల్లో ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా కొప్పోలు రాజును రంగంలోకి దింపింది. 1988 నుంచి 1991 వరకు ఆయన ఇక్కడ కలెక్టర్‌గా పనిచేశారు. సారా వ్యతిరేక, అక్షరాస్యతా, పొదుపు ఉద్యమాల్లో ప్రజల పక్షాన నిలబడ్డారు. ఆయన అభ్యర్థి అయితే ఇండియా బ్లాక్‌కు ఆదరణ ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. వామపక్షాలకు ప్రధానంగా సిపిఎంకు జిల్లాలో బలమైన ఓటింగ్ ఉంది. ప్రజా కలెక్టర్‌గా పేరు, కాంగ్రెస్ సాంప్రదాయ ఓటింగ్,. వామపక్షాలు, ఇతర మద్దతు పార్టీల ఓటింగ్ రాజుకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తున్నాయి. ఎవరి ఓట్లకు ఇండియా వేదిక చిల్లు పెడుతుందోనని ఉత్కంఠ రేపుతోంది. ఈ త్రిముఖ పోటీలో ఎవరిని విజయం వరిస్తుందో వేచి చూడాలి !

సంపాదకీయం

విలువైనది జీవితం

ప్రతి మనిషి జీవితంలో చాలా చేయాలనుకుంటాడు. చివరకు ఏవో కొన్ని మాత్రమే చేయగలుగుతాడు. అది కూడా సంపూర్ణంగా చేయలేకపోవచ్చును కూడా. అందరూ అష్టావధానం చేయలేరు. అలాగని చేయలేనంత మాత్రాన వారు అసమర్థులు కారు. పట్టుదల, కృషి వుంటే సామాన్యులు కూడా అద్భుతాలు చేయగలుగుతారు. గొప్పగొప్ప శాస్త్రవేత్తలుగా ప్రపంచ ఖ్యాతి పొందినవారిలో కొందరు బాల్యంలో చదువులో అంతగా రాణించనివారే. 'మనిషై పుట్టినవాడు కారాదు మట్టిబొమ్మ/ పట్టుదలే వుంటే కాగలడు మరో బ్రహ్మ' అంటాడో సినీకవి. ఐన్‌స్టీన్‌కు మొదట్లో మాట్లాడటం కష్టంగా వుండేది. చదువులోనూ అంతగా రాణించలేకపోయేవాడు. తన 16 ఏళ్ల వయసులో స్విస్ ఫెడరల్ పాలిటెక్నిక్ స్కూల్లో జరిగిన ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఆ తర్వాత అదే ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రంలో చేసిన కృషికి గాను నోబెల్ బహుమతి అందుకున్నాడు. యాపిల్ కంప్యూటర్ సృష్టికర్త స్టీవ్‌జాబ్స్ కూడా కళాశాలలో అట్టడుగు విద్యార్థే. అంతెందుకు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ దేవుడు అంటూ నీరాజనాలు అందుకున్న సచిన్ టెండుల్కర్ చదివింది కేవలం 12వ తరగతి వరకే. తనకు ఇష్టమైన క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుని అందులో ఎదిగాడు. 'చదువు ప్రతిభను రాణింపజేసే ఒక సాధనమే కానీ, దానికి కారణమూకాదు, ఫలితమున్నూకాదు' అంటారు శ్రీపాద. చదువు ఆ వ్యక్తిలోని సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా వుండాలి.

మన దేశంలో చాలామంది తమ పిల్లలు ఇంజనీరింగ్ లేదా మెడికల్ కోర్సుల్లో సీటు సంపాదించడం ప్రతిష్టగా భావిస్తారు. ఎలాగైనాసరే... ర్యాంకులు కొట్టాలన్న పోటీ వాతావరణంలో నవతరం ఒత్తిడికి లోనవుతోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిక్షణా సంస్థల ఒత్తిళ్లు, ఆశల భారాన్ని తట్టుకోలేని విద్యాకుసుమాలు అర్థాంతరంగా నేలరాలుతున్నాయి. గత పదేళ్లుగా తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. దేశంలో ప్రతి 42 నిమిషాలకు ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌లే కారణం. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆరుగురు విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది బలవంతాన ప్రాణాలు తీసుకున్నారు. ధనార్జనే లక్ష్యంగా గల కార్పొరేట్ విద్యాసంస్థలు సృష్టించే కృత్రిమ పోటీ- ర్యాంకుల వెంట పరుగు తీయించడం వంటివి అనర్థదాయకం. ఇలాంటి ధోరణులను ప్రభుత్వాలు అనుమతించరాదు. కాని పాలకులకు అటువంటి చిత్తశుద్ధి కరువవుతోంది.

భారతదేశం యువ విజ్ఞాన నిధి. అత్యధిక యువ సంపద కలిగిన దేశం మనది. '2040 నాటికి మన దేశ జనాభాలో 59శాతం మంది యువతే వుంటారని' ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ వెల్లడించింది. 2012 నుండి, భారతదేశంలో ప్రతి సంవత్సరం విద్యార్థుల ఆత్మహత్యల కేసులు 2.3శాతం పెరుగుతున్నాయి, మనం ఎవరిని నిందించాలి? తల్లిదండ్రులనా? ప్రభుత్వాలనా? గ్లోబలైజేషన్ ఊబిలో కూరుకుపోయిన విద్యావ్యవస్థలోని కార్పొరేట్ పోటీనా? గొంతులు కోసుకునే అసలు దోషి ప్రభుత్వం అదుపులేని కార్పొరేట్ విద్యావ్యవస్థేనన్నది నిస్సందేహం. తప్పు ఎవరిదైనా బలిపోతున్నది మాత్రం యువశక్తి. ఈ యువశక్తిని కాపాడుకొని, దేశాభివృద్ధిలో పాలుపంచుకునేలా చేసే బాధ్యత ప్రభుత్వాలది. మార్కులు, ర్యాంకులే సర్వస్వం కాదు. అంతకంటే విలువైనది జీవితం. చదువు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి మానసిక వికాసాన్ని పెంపొందించుకోడానికి దోహదపడాలి. 'విద్యార్థులలో నేర్చుకోవాలన్న ధ్యాస రేకెత్తించకుండా ఉపాధ్యాయుడు బోధించడానికి ప్రయత్నించడం... చల్లని ఇనుముపై సమ్మెట వేయటం వంటిది' అంటారు హొరెస్‌మాన్. ఇతరులు సాధించిన విజయాన్ని చూసి అసూయ చెందడం, న్యూనతా భావానికి గురవడం కాక, ఆ విజయం నుంచి స్ఫూర్తి పొందేలా పిల్లలను తీర్చిదిద్దాలి. ఆత్మవిశ్వాసమనే ఆయుధాన్ని అందించాలి. చదువులో వెనకపడ్డామని ఏ విద్యార్థీ చింతించాల్సిన పనిలేదు. వారు చేసే కృషిలో వెనకపడకుండా వుంటే చాలు. విజయాలు వాటంతటవే స్వాగతిస్తాయి.

మంచి మాట



జ్ఞానం వంశపారంపర్యంగా వచ్చేది కాదు. దానిని ఎవరికి వారు సంపాదించుకోవాల్సిందే.
- స్టీవ్‌జాబ్స్

ఊపు తగ్గిన బిజెపి...ఉన్మాద వ్యూహాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

ప్రధానమంత్రి, బిజెపి సర్వాధినేత నరేంద్ర మోడీ ఇటీవల మాట్లాడే మాటలు ఆయన రాజ్యాంగ రీత్యా నిర్వహిస్తున్న బాధ్యతలకే గాక రాజకీయంగా ఆ పార్టీ పరిధిని కూడా మించిపోతున్నాయి. అసలు ఒక పార్టీగా గానీ ఒక ప్రభుత్వాధినేతగా గానీ ఆయన అవన్నీ మాట్లాడవలసిన అగత్యం లేకపోగా రాజ్యాంగం కనీసంగా తెలిసిన వారైనా జీర్ణించుకోలేని పరిస్థితి. నిజానికి మొదటి దశ పోలింగ్ సరళి మింగుడుపడకే మోడీ ఏదేదో మాట్లాడుతున్నారని దేశంలో రాజకీయ చర్చను ఎక్కడికో తీసుకుపోజూస్తున్నారని పరిశీలకులు, మీడియా మొత్తంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంలో బిజెపి అనుకూలమైన వారు కూడా ఆశ్చర్యాన్ని దిగమింగి ఏదోవిధంగా సమర్థించేందుకు తంటాలు పడుతున్నారు. రెండో విడత పోలింగ్ కూడా అందుకు పెద్ద భిన్నంగా లేదని సమాచారం. కాబట్టి మోడీ విద్వేష వాక్కులు విజృంభించడమే గానీ తగ్గుముఖం పట్టక పోవచ్చు. దీని ద్వారా ఆయన ఆశించే ప్రయోజనాలు రెండు: ఒకటి అలవాటైన మత రాజకీయాలను రగిలించడం, రెండోది తలా తోక లేని ఆరోపణలతో ప్రజలను అయోమయానికి గురిచేయడం. మొదట ఆయన రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో ప్రసంగించారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఆస్తిపాస్తులు తీసుకుని ముస్లింలకు ఇచ్చేస్తుందని భయపెట్టారు (దానిపై ప్రజాశక్తిలో ఇప్పటికే పలు వ్యాఖ్యలు వచ్చాయి). అది కాస్త బెడిసి కొట్టడంతో మొత్తం ఆస్తులకే ఎసరు పెడతారని కొత్తపాట అందుకున్నారు. ఇందుకు మద్దతుగా ఒకప్పటి ఆ పార్టీ సలహాదారు శ్యామ్ పిట్రోడా ఎప్పుడో చేసిన ఒక వ్యాఖ్యను తీసుకొచ్చారు. బాగా ధనాఢ్యులైన వారు ఆస్తిని వారసులకు అప్పగించి చనిపోతే వారి మరణానంతరం వారసత్వ పన్ను వేయొచ్చుననేది ఆయన ప్రస్తావించిన అంశం. అమెరికాలో 45 శాతం, జపాన్‌లోనైతే ఏకంగా 55 శాతం వున్న ఈ పన్ను మొత్తాన్ని ఆస్తి విలువ నుంచి మినహాయించుకుని ఇవ్వాలనేది ఆ చట్టాల సారాంశం. భారత దేశంలో అలాంటి చట్టం లేదు గానీ ఆర్థిక సమానత్వం, సమాజ ప్రయోజనాల కోసం ఆస్తిని తీసుకోవడం వంటి అంశాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోని 39(బి) పరిధిలోవి. దాని అమలుకు సంబంధించిందే 31(సి) యజమాని లేని ఆస్తులను లేదా అవసరమైన వాటిని తీసుకోవడానికి అవకాశమిస్తున్న మాట నిజం. ఇందుకు భిన్నంగా ప్రైవేటు ఆస్తికి 19వ అధికరణం రక్షణనిస్తుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ యుగంలో ఇవన్నీ తెర వెనక్కుపోయిన మాట నిజమేగాని మౌలికంగా ఆ భావన తప్పు కాదు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ వంటి సందర్భాలలో ఈ రెంటికీ మధ్యనే చర్చ జరిగింది.

ఎందుకీ ప్రచారాలు? కోర్టులేమన్నాయి?

కమ్యూనిస్టు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు దాన్ని దెబ్బ తీయడం కోసం ఆస్తులు లాగేసుకుంటారని పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి ప్రగతి నిరోధక శక్తులు. ఇందిరా గాంధీ కాస్త భూసంస్కరణలంటూ హడావుడి చేసిన సమయంలోనూ వీరంతా ఇదే విధంగా గగ్గోలు పెట్టారు. వాస్తవానికి ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితిలో ప్రజల ఆస్తులు ప్రభుత్వాలే ప్రైవేటు పరం చేయడం పరిపాటిగా మారింది. మోడీ హయాంలోనే పెట్టుబడుల ఉపసంహరణ మంత్రంగా మారింది. ఇదే విశాఖ ఉక్కు వరకూ పాకింది. దానిపై ప్రజాందోళనకు కేంద్రం స్పందించడం లేదు కూడా. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు ప్రవేటు పరం చేయడంలో ముందున్న మోడీ వ్యక్తిగత ఆస్తులకేదో ముప్పు దాపురిస్తుందని భయపెట్టడం వంచనాశిల్పం మాత్రమే! హిందూ ముస్లిం తేడా లేకుండా మిగిలిన వారిని కూడా హడలగొట్టడంలో ఆయన ఆలోచన ఏమిటో వేరే చెప్పనక్కరలేదు. ఆసక్తికరం ఏమంటే ఈ సమయంలోనే సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సమస్య చేపట్టింది. ముంబయి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ ఎప్పుడో వేసిన ఒక పిటిషన్‌ను దుమ్ము దులిపి తీసింది. ప్రజా ప్రయోజనాల కోసం ప్రైవేటు ఆస్తిని తీసుకోవడం ఆదేశిక సూత్రాల్లోని 39(బి) సారాంశం. ధర్మాసనంలోని జస్టిస్ నాగరత్న దీనిపై కీలక వ్యాఖ్యలే చేశారు. సరళీకరణ యుగంలో ప్రైవేటీకరణకు ఇది విరుద్ధం కదా అని అడిగారు. తాను మార్క్సిస్టుల తరహాలో ఆస్తి పంపిణీ గురించి చెప్పడం లేదనీ, అయితే ఈ అంశానికి ప్రాధాన్యత వుంటుందని ఆయనన్నారు. దీనిపై ఇది చివరకు ఏ దిశలో పయనించేదీ ఓపిగ్గా వేచి చూడవలసిందే. కానీ మోడీ మాత్రం ఈలోగానే ఏదో జరిగిపోతుందనీ అందరి ఆస్తి పోతుందని గగ్గోలు పెడుతున్నారు. శ్యామ్ పిట్రోడా ఇతర వీడియోలు కూడా తవ్వి తీస్తున్నారు. ఇంతా చేసి పిట్రోడా ఇప్పుడేమీ కాంగ్రెస్‌తో లేరు. అసలు క్రియాశీల రాజకీయవేత్తా కాదు. అయినా బిజెపికి జనాన్ని కంగారు పెట్టే ఏదో అంశం కావాలి కదా!



> వాస్తవానికి ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితిలో ప్రజల ఆస్తులు ప్రభుత్వాలే ప్రైవేటు పరం చేయడం పరిపాటిగా మారింది. మోడీ హయాంలోనే పెట్టుబడుల ఉపసంహరణ మంత్రంగా మారింది. ఇదే విశాఖ ఉక్కు వరకూ పాకింది. దానిపై ప్రజాందోళనకు కేంద్రం స్పందించడం లేదు కూడా. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు ప్రవేటు పరం చేయడంలో ముందున్న మోడీ వ్యక్తిగత ఆస్తులకేదో ముప్పు దాపురిస్తుందని భయపెట్టడం వంచనాశిల్పం మాత్రమే! హిందూ ముస్లిం తేడా లేకుండా మిగిలిన వారిని కూడా హడలగొట్టడంలో ఆయన ఆలోచన ఏమిటో వేరే చెప్పనక్కరలేదు.

సకల వర్గాల్లో ఆందోళన

ఆస్తిక వాదమంతా తమదేనని మత రాజకీయాలు నడిపే బిజెపి ఆస్తి విషయాల వైపు రావడం యాదృచ్ఛికమేమీ కాదు. అంతెందుకు? ముస్లింలకు ఆస్తి ఇస్తారంటూ మొదటి రోజు చెప్పిన మోడీ దానిపై విమర్శలు వచ్చాక కూడా మార్చుకోకపోగా హనుమాన్ జయంతి రోజున హనుమాన్ చాలీసా చదవనివ్వడం లేదని కొత్త ఆరోపణ చేశారు. ఇక్కడో విశేషం వుంది. నరేంద్ర మోడీని 'నమో' అంటుంటారు భక్తులు. నిజానికి నమో నమ:శివాయ అనేది శివభక్తులు వాడేది. కానీ కాశీలో పోటీచేసి గెలిచిన మోడీకే ఆ విశేషం తగిలించేశారు. అలాగే హనుమాన్ చాలీసా తరహాలో మోడీ చాలీసా కూడా రచించారు! ఆయన వ్యక్తి ఆరాధన అంత ఎత్తుకు తీసుకుపోవడం సంఘ పరివార్ వ్యూహంలో భాగమే. అయితే రాను రాను ఈ ప్రభ మసకబారిందని వారు గ్రహించక తప్పలేదు. మరే సమస్య లేనట్టు మోడీ పేరే ఊపేస్తుందన్న భావం కరిగిపోయింది. మతాన్ని, రాజకీయాలను కలిపే పాత పాచికలూ పారడం లేదు. స్థానిక నాయకులెవరైనా జాతీయంగా మోడీ సరిపోతాడన్న ప్రచారం కర్ణాటక నుంచి చాలా చోట్ల వీగిపోయింది. అనేక అంశాలలో కేంద్ర నిరంకుశత్వం వారి గడపలను తాకింది. ఈ సమయంలో మోడీ సభలకు, చిట్కాలకు అసలు స్పందన తగ్గిపోతున్నది. వివిధ పార్టీల కీలక నాయకులను అసలు బిజెపిలోనే స్థానికంగా పట్టు కలిగిన నేతలను కూడా తోసిరాజన్న మోడీ ధోరణిని వారు ఆమోదించలేకపోతున్నారు. చాలా సర్వేలలో సంకేతాలు వచ్చినట్టు నిరుద్యోగం, ధరల పెరుగుదల, దారిద్ర్యం వంటివి వారిని ఎంతగానో కలవర పరుస్తున్నాయి. వ్యవసాయ రంగానికి మరో సమస్య. మీడియా, విద్యాలయాలు, మేధావి వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు, న్యాయవ్యవస్థ, కవులు, రచయితలు, ఆఖరుకు సినిమా రంగం కూడా మోడీ హయాంలో ముదిరిపోయిన ఏకపక్ష ఆధిపత్యానికి గురికాక తప్పలేదు. రాజకీయ సేవలో మతాన్ని వాడుకోవడం కోసం మోడీ మతాచార్య పాత్రనూ తనే లాగేసుకోవడంతో అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ట ఒక వివాదంగా మారింది. ఇక ఆరుగాలం శ్రమ పడే రైతుల ఆగ్రహావేదనలు ఆందోళనగా ప్రజ్వరిల్లి దేశాన్ని ప్రతిష్టంభనకు గురిచేశాయి. ఈ సమయంలో కాశ్మీర్ 370, సరిహద్దులలో ఉద్రిక్తతలు, సర్జికల్ స్ట్రయిక్స్ వంటి ఊపునిచ్చే వాతావరణం మారుతున్నది. మోడీని త్రీడీలో చూపిన ప్రచార పొర కూడా కరిగిపోతున్న దశ. అన్ని చోట్లా అన్ని సందర్భాల్లో అన్ని వేదికల్లో ఆయనే ప్రత్యక్షమై ప్రబోధకుడుగా ప్రభవించడం, ప్రజలు ఆమోదించడం బాగా తగ్గింది. బిజెపిలోనూ సంప్రదాయ నాయకత్వం శ్రేణులు ఎదురు తిరగడం మొదలుపెట్టారు. ఎ.పి, తెలంగాణలలోనే బిజెపి శిబిరాలు గమనిస్తే వాస్తవం తెలుస్తుంది. ఆ పార్టీ పెద్ద శక్తిగా లేని చోట్లనే ఇలా వుంటే ఒక పునాది గల చోట్ల నాయకులు, సీనియర్ కార్యకర్తలు, అభిమానులు ఎలా స్పందిస్తారో తేలిగ్గా ఊహించవచ్చు. రెండు సార్లు మూడు సార్లు ముఖ్యమంత్రులైన వారితో సహా బడిపిల్లల్లా బందిఖానాలకు పంపిస్తుంటే ఎన్నుకున్న ప్రజల్లోనూ ప్రతికూలత రావడం సహజం. ఇక ఆయనను ఆశ్రయించుకున్న వర్గాలేమో అదానీ అయినా, రామదేవ్ బాబా అయినా రకరకాలుగా దొరికిపోతున్న దశ. మోడీపై మోహం మొత్తడమేగాక నిరాసక్తత, నిరసన కూడా పెరగడానికి ఇవన్నీ కారణమైనాయి.

చంద్రబాబు వింత లెక్కలు

విచిత్రమేమంటే ఇలాంటి దశలోనే ఎ.పిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పవన్ కళ్యాణ్ వెంటబడి మరీ ఎన్‌డిఎగా పొత్తు కుదర్చుకున్నారు. అది ఎంత అస్తవ్యస్తంగా నడుస్తున్నదీ అనుదినం చూస్తున్నాం. ఆ పార్టీ కీలక నేతలే కలిసిరావడం లేదంటే అదేదో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పైన కోపమే కాదు. మోడీ పైనా నిరసనే. కాకుంటే ఈ సమయంలోనూ మోడీని దార్శనికుడుగా పొగడ్డం చంద్రబాబుకే చెల్లింది. తాజాగా ఇంటర్వ్యూలో అర్ణబ్ గోస్వామి మోడీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారని అడిగినప్పుడు దేశ ఉజ్వల భవిష్యత్తు కోసమని ఆయన జవాబివ్వడం నవ్వు తెప్పిస్తుంది. బిజెపితో పొత్తు టిడిపికి నష్టమని ఆ పార్టీ వారే భయపడుతుంటే ముఖ్యమంత్రి జగన్‌ను ఓడించడానికి అవసరమైందని చంద్రబాబు సమర్థించుకున్నారు. అంతకంటే కూడా ఎన్నికల ఫలితాలపై అంచనా అడిగితే 400 స్థానాలపైన వస్తాయని బాబు చెప్పడం అవాస్తవికతకు పరాకాష్ట. పురందేశ్వరి కూడా తమ పొత్తు పార్టీలో కొందరికి ఇష్టం లేదని ఇంటర్వ్యూలలో చెప్పడం గమనించగలం. బిజెపికి పూర్తి మెజార్టీ రాకూడదని కోరుతున్నానని జగన్ పదేపదే అనడంలో ఉద్దేశం స్పష్టమే. స్వంతంగా మెజార్టీ రాకున్నా ఇలాంటి వారందరితో కలిసి పాలన చేద్దామన్నది మోడీ వ్యూహం. అందుకే పెద్ద ప్రయోజనం లేదని తెలిసినా టిడిపితో చేతులు కలిపి వైసీపీతోనూ సాన్నిహిత్యం కొనసాగిస్తున్నారు. బిజెపి, టిడిపి నేతలు అవలీలగా అటూ ఇటూ మారి కండువాలు మార్చుకుంటున్నారు. రాజకీయాలకు దూరంగా వున్నామంటూ వచ్చిన చిరంజీవి వంటి మెగాస్టార్లు బిజెపితో పొత్తు మంచిదని కితాబులిస్తున్నారు. తెలంగాణలోనూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని శాపనార్థాలు పెడుతూ పరోక్షంగా బిజెపి ప్రయోజనం నెరవేరుస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నోటా అదే పాట వినిపిస్తున్నది. తెలుగు నేలపై కాషాయ రాజకీయ క్రీడలను ఈ పరిణామాలే స్పష్టం చేస్తాయి. అయితే స్వతహాగా ఆ పార్టీ ఇక్కడేదో దూసుకొస్తుందనేది కల మాత్రమే. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య నాటకం నడపాలని చూసిన బిజెపి పథకాలు కూడా వేగంగానే తేలిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనివార్యంగా బిజెపిపైనా తీవ్రంగా స్పందించక తప్పలేదు. ఎ.పి లో పవన్, చంద్రబాబు పొత్తు పెట్టుకున్నా, తెలంగాణ నేతలు ఊగిసలాడినా వ్యతిరేకత తగ్గకపోవడం పరిస్థితికి ప్రతిబింబమే. ఇప్పుడు బిజెపికి 300-400 స్థానాల పాట ఎవరూ పాడటం లేదు. కులమతాలను, కుటుంబాలను, ఆర్థిక సాంస్కృతిక వ్యవహారాలను ఆందోళనకు గురిచేస్తే తప్ప గట్టెక్కలేమని మోడీనే గుర్తిస్తున్న స్థితి రెండో దశలోనే కనిపిస్తున్నది. ఇందుకు సంబంధించిన సీట్ల వివరాలు, గత నేపథ్యాలు కూడా అందుబాటులో వున్నాయి. మతతత్వ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయకూడదని ప్రజలుకూడా గ్రహిస్తున్నారా అనే ప్రశ్నకు ఈ పరిణామాలు ఆస్కారమిస్తున్నాయి. దానిపై పోరాటం పెంచడానికి ఇదే సమయమనీ గుర్తు చేస్తున్నాయి. ★

> ఆయన వ్యక్తి ఆరాధన అంత ఎత్తుకు తీసుకుపోవడం సంఘ పరివార్ వ్యూహంలో భాగమే. అయితే రాను రాను ఈ ప్రభ మసకబారిందని వారు గ్రహించక తప్పలేదు. మరే సమస్య లేనట్టు మోడీ పేరే ఊపేస్తుందన్న భావం కరిగిపోయింది. మతాన్ని, రాజకీయాలను కలిపే పాత పాచికలూ పారడం లేదు. స్థానిక నాయకులెవరైనా జాతీయంగా మోడీ సరిపోతాడన్న ప్రచారం కర్ణాటక నుంచి చాలా చోట్ల వీగిపోయింది. అనేక అంశాలలో కేంద్ర నిరంకుశత్వం వారి గడపలను తాకింది. ఈ సమయంలో మోడీ సభలకు, చిట్కాలకు అసలు స్పందన తగ్గిపోతున్నది. వివిధ పార్టీల కీలక నాయకులను అసలు బిజెపిలోనే స్థానికంగా పట్టు కలిగిన నేతలను కూడా తోసిరాజన్న మోడీ ధోరణిని వారు ఆమోదించలేక పోతున్నారు. చాలా సర్వేలలో సంకేతాలు వచ్చినట్టు నిరుద్యోగం, ధరల పెరుగుదల, దారిద్ర్యం వంటివి వారిని ఎంతగానో కలవర పరుస్తున్నాయి. వ్యవసాయ రంగానికి మరో సమస్య. మీడియా, విద్యాలయాలు, మేధావి వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు, న్యాయవ్యవస్థ, కవులు, రచయితలు, ఆఖరుకు సినిమా రంగం కూడా మోడీ హయాంలో ముదిరిపోయిన ఏకపక్ష ఆధిపత్యానికి గురికాక తప్పలేదు.

ప్రజాస్వామ్యానికి ఊపిరి వామపక్షాలే

వ్యాసం

ఆర్. లక్ష్మయ్య

> మతం పూర్తిగా వ్యక్తిగతమైనది. తమకు ఇష్టమైన మతాన్ని అనుసరించే స్వేచ్ఛ భారత పౌరులకు వున్నది. మతం రాజ్యంలో జోక్యం చేసుకోకూడదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. అయితే ఇప్పుడు ఏం జరుగుతోంది? అన్ని రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఓట్లను సమీకరించే సాధనంగా మతాన్ని వాడుకుంటున్నారు. మైనారిటీ ప్రజలను బెదిరించి ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు. వీటన్నిటి ఫలితంగా, ఇప్పుడు దేశం, ప్రజలు ప్రమాదకరమైన పరిస్థితిలోకి నెట్టబడ్డారు. ఈ తరుణంలో వామపక్షాలు పటిష్టంగా వుండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలను, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పార్లమెంటులో వామపక్షాలు ఒక బలమైన శక్తిగా రావాల్సిన అవసరం ఉంది. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు ఓటు వేసి గెలిపించుకోవాల్సి వుంది.

మనం ఇప్పుడు సాధారణ ఎన్నికల ముంగిట్లో వున్నాం. ఈ ఎన్నికల ప్రచార సరళిని చూస్తే చాలు! ప్రజల కోసం పని చేస్తున్నది ఎవరు? మతం కార్డుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి ఓట్లు కొల్లగొట్టాలనుకుంటున్నది ఎవరు? అనేది అర్థమౌతుంది. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, సమాఖ్య విధానానికి ప్రమాదం పొంచి వున్న నేటి పరిస్థితుల్లో సిపిఎంను, వామపక్షాలను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

2004 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి పరాజయం పాలైంది. ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ తగిన మెజారిటీని పొందలేకపోయింది. 61 మంది ఎంపీలతో వామపక్షాలు, 44 మంది ఎంపీలతో సిపిఎం పెద్ద శక్తిగా అవతరించింది. కనీస ఉమ్మడి కార్యక్రమం అమలుకు అంగీకరించేట్లయితే అనే షరతుతో ప్రభుత్వ ఏర్పాటుకు వామపక్షాలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చాయి. అందుకు కాంగ్రెస్ అంగీకరించి డా. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. ఆ విధంగా కనీస ఉమ్మడి కార్యక్రమం కారణంగా భారతదేశంలోని వివిధ వర్గాల ప్రజలు ప్రయోజనం పొందారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) ఉద్యోగ హక్కు ప్రాథమిక హక్కులలో లేనప్పటికీ అమలులోకి వచ్చింది. కరోనా సమయంలో దేశం అకస్మాత్తుగా కఠినమైన లాక్‌డౌన్‌లోకి నెట్టబడినప్పుడు గ్రామీణ, వలస కార్మికులను ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కొంత వరకు కాపాడింది. ఈ రోజు కూడా గ్రామీణ పేదలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

అదే సమయంలో సమాచార హక్కు చట్టం కూడా రూపొందించబడింది. ఫలితంగా వివిధ మంత్రిత్వ శాఖలతో సహా ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సమాచారాన్ని నేడు పొందగలుగుతున్నారు.

విద్యా హక్కు చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, భూసేకరణ చట్టం కూడా కనీస ఉమ్మడి కార్యక్రమ ఫలాలే.

అసంఘటిత రంగ కార్మికులు మొత్తం కార్మికులలో 92 శాతం మంది వున్నారు. వారికి ఎటువంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు లేకుండా పనిచేస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం డాక్టర్ అర్జున్‌సేన్ గుప్తా నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం అత్యంత ముఖ్యమైనది. అసంఘటిత రంగ కార్మికుల స్థితిగతులను విశ్లేషించిన ఆ కమిటీ జాతీయ సాంఘిక భద్రతా పథకానికి సిఫార్సు చేసింది. అలాగే జాతీయ స్థాయి కనీస వేతనం, అసంఘటిత రంగ కార్మికులకు జాతీయ నిధికి కూడా సిఫార్సు చేసింది. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలను కూడా ఆ కమిటీ నొక్కి చెప్పింది.

రవాణా కార్మికుల విషయానికొస్తే, వారి సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారానికి తగిన సిఫారసుల కోసం వి.వి.గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్‌కి ప్రభుత్వం అప్పగించింది. అసంఘటిత రంగ రవాణా కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం చేయాలని వి.వి. గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ సిఫారసు చేసింది. ఇది అత్యంత ప్రాధాన్యత కలిగినది. కానీ తరువాత రాజకీయ పరిస్థితులలో వచ్చిన మార్పు కారణంగా ఆ సిఫారసు మరుగున పడింది.

ప్రభుత్వ రంగ పరిశ్రమలను యథేచ్ఛగా విక్రయించడం, మూసివేయడానికి అడ్డుకట్ట వేయబడింది. ఖాయిలా పడిన పరిశ్రమల పునరుద్ధరణకు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోబడ్డాయి. పార్లమెంటులో వామపక్షాలు ఒక బలమైన శక్తిగా వుండడం వల్ల సమాజంలోని వివిధ వర్గాలు ప్రయోజనం పొందాయి.

ఈ పదేళ్ల మోడీ పాలనలో ఇవన్నీ దాడికి గురవుతున్నాయి. సెక్యులరిజం, రాజ్యాంగం, అన్ని ఇతర సంస్థలు దాడికి గురవుతున్నాయి. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎకి కేటాయింపులు తగ్గాయి. పని దినాల సంఖ్య కూడా తగ్గింది. ఆర్‌టిఐ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు మొదలైనాయి.

నూతన విద్యా విధానం (ఎన్.ఇ.పి) పేద వర్గాలను ఉన్నత చదువులకు దూరం చేస్తున్నది. 26 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్లను ప్రభుత్వం తెచ్చింది. లేబర్ కోడ్లు అమలులోకి వస్తే కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడతారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్దాక్షిణ్యంగా అమ్మివేయడం నేటి ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. "ప్రభుత్వ రంగం పుట్టింది చావడానికే"నని గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగంగా చెప్పారు.

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పథకం ద్వారా జాతీయ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారు. నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకుంది. రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు తీసుకొచ్చారు. మొత్తంమీద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ శతకోటీశ్వరుల సంఖ్య పెరిగింది. వారి సంపద అనేక రెట్లు పెరిగింది.

ఎలక్టోరల్ బాండ్ల సమస్యపై సుప్రీంకోర్టు తీర్పు దేశాన్ని కుదిపివేసింది. విస్మయపరిచే వార్తలు, విశ్లేషణలు వస్తున్నాయి. తన ప్రయోజనాల కోసం బిజెపి ఎలక్టోరల్ బాండ్లను ఏ విధంగా ఉపయోగించుకుందనే విషయమై అనేకానేక కథనాలు వస్తున్నాయి. ఇ.డి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖల దాడులను ఎదుర్కొన్న కంపెనీలను ఎన్నికల బాండ్లు ఇచ్చిన తర్వాత విడిచిపెట్టారు. కొన్ని కంపెనీలు భారీ కాంట్రాక్టులు పొందాయి. అత్యంత ప్రమాదకరమైన మరొక విషయం ఫార్మాస్యూటికల్ కంపెనీలు నకిలీ మందులను తయారు చేసి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయి. ఆ కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను ఇచ్చాక వాటిపై కేసులను ముగించారన్న వార్తలు వచ్చాయి. కొందరు నిపుణులు ఇది ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణమని చెప్పారు. వామపక్షాలు మాత్రమే ఎన్నికల బాండ్లను పార్లమెంట్‌లో వ్యతిరేకించాయి. ఎలక్టోరల్ బాండ్ల కింద ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టులో సవాలు చేసిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం మాత్రమే.

మతం పూర్తిగా వ్యక్తిగతమైనది. తమకు ఇష్టమైన మతాన్ని అనుసరించే స్వేచ్ఛ భారత పౌరులకు వున్నది. మతం రాజ్యంలో జోక్యం చేసుకోకూడదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. అయితే ఇప్పుడు ఏం జరుగుతోంది? అన్ని రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఓట్లను సమీకరించే సాధనంగా మతాన్ని వాడుకుంటున్నారు. మైనారిటీ ప్రజలను బెదిరించి ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు.

వీటన్నిటి ఫలితంగా, ఇప్పుడు దేశం, ప్రజలు ప్రమాదకరమైన పరిస్థితిలోకి నెట్టబడ్డారు. ఈ తరుణంలో వామపక్షాలు పటిష్టంగా వుండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలను, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పార్లమెంటులో వామపక్షాలు ఒక బలమైన శక్తిగా రావాల్సిన అవసరం ఉంది.

వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు ఓటు వేసి గెలిపించుకోవాల్సి వుంది.

/ వ్యాసకర్త 'ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్' ప్రధాన కార్యదర్శి /

కవిత్వం

తరలొచ్చి ఓట్లేయండి

ఓటర్లూ! రండి! లేచి రండి
కదలి రండి! తరలి రండి
గడప దాటి గబగబా
ఇళ్లు వీడి ఓట్లేయ్యడానికి
ఎన్నికల జాతరకు రండి
అలసత్వాన్ని అణిచి
ఓట్లకు దూరమనే భావనను
మది నుండి తొలిచి
కూతవేటు దూరాన
వెలసిన పోలింగ్ బూత్‌కు
సులభతరంగా స్వేచ్ఛగా
ఓటు హక్కు వినియోగానికి
రండి! రారండి!
ఎందుకో నామోషీ
ఒక్క క్షణం ఆలోచించండి
ఓట్ల విలువ తెలియు
విధిగా ఓట్లేయడం
హేతుబద్ధమైన ఆలోచన
ఓట్లను విజ్ఞతతో వేస్తే
ప్రజాస్వామ్యం ప్రజ్వరిల్లు
ఈ సార్వత్రిక ఎన్నికల్లో
ఓట్లేయటమే కావాలి లక్ష్యం
తప్పకవుతుందది సాధ్యం!
ఓట్ల విలువేమిటో తెలుసుకో
మీ ఓట్లు చాలా అమూల్యం
మీ ఓట్లు దేశ భవిత కోసం
ఇంకెందుకు ఆలస్యం?

- డా. సి.ఎల్.చెన్నారెడ్డి
ఎస్వీ జూనియర్ కళాశాల,
సెల్ : 9885791661

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

పోలింగ్ ఏజెంట్లను బయటకీడ్చేశారు!

- త్రిపురలో రెండో విడతలోనూ అక్రమాల జోరు
- అంబాసోల్ లో 112శాతం పోలింగ్
- ఇళ్లపై దాడులు, లూటీలు
- ఓటర్లకు బెదిరింపులు
- ఎన్నికల సంఘానికి ఇండియా బ్లాక్ నేతల ఫిర్యాదు

పోలింగ్‌లో అక్రమాలను మీడియాకు వివరిస్తున్న ఇండియా బ్లాక్ నాయకులు

ఇండియా న్యూస్ నెట్‌వర్కు- అగర్తల

పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గంలో చోటు చేసుకున్న ఎన్నికల అక్రమాలు ఆ స్థాయిలో కాకపోయినా ఇంచుమించు అదే పరిస్థితి శుక్రవారం పోలింగ్ జరిగిన త్రిపుర తూర్పు (ఎస్‌టి)లోనూ పునరావృతమైంది. ఎన్నికల సంఘం ప్రత్యేకించి ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాల్లో 15 బూత్‌లలో ఇండియా బ్లాక్‌కు చెందిన ఏజెంట్లను పాలక పార్టీ గూండాలు బయటకు ఈడ్చి, ఓటర్లను బెదిరించి వెనక్కి పంపేశారు. కేంద్ర భద్రతా బలగాలతో భద్రత కట్టుదిట్టంగా ఉండే మోడల్ బూత్‌లలో పరిస్థితే ఇలా ఉంటే ఇక సాధారణ పోలింగ్ బూత్‌లలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎన్నికల ప్రచారం ముగిసినప్పటి నుంచే బిజెపి ఈ నియోజకవర్గంలో ఓటర్లను, పోలింగ్ ఏజెంట్లను బెదిరించే కార్యక్రమం చేపట్టింది. కొన్ని చోట్ల భౌతిక దాడులకు దిగింది. ఓటర్లను ఇంటి నుంచి బయటకు రాకుండా చేయాలని చూసింది. ఇండియా బ్లాక్ కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని లూటీలు, విధ్వంసానికి పాల్పడింది. కృష్ణాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పది ఇళ్లను బిజెపి గూండాలు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పోలింగ్ రోజున బిజెపి దుండగులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ బైక్‌లపై స్వైర విహారం చేశారు. ఓటర్లలో విశ్వాసం నింపాల్సిన కేంద్ర బలగాలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడా కానరాలేదు.. మొత్తం 71 మంది పోలింగ్ ఏజెంట్లను బిజెపి దుండగులు దాడి చేసి బయటకు తరిమేశారని తెలియాముర సబ్ డివిజనల్ సిపిఎం కార్యదర్శి తెలిపారు. కుమార్‌ఘాట్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారే స్వయంగా ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులొచ్చాయి. మోహన్‌పూర్, రిష్యముఖ్, ధరమ్‌కానగర్, కమలాపూర్, సుర్మా అసెంబ్లీ సెగ్మెంట్లలో గురువారం రాత్రి నుంచే బిజెపి గూండాలు భయానక వాతావరణం సృష్టించారని ఇండియా బ్లాక్ నాయకులు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనరు నారాయణ కర్మాకర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి యుధిష్టిర్ దాస్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి దీపక్ దేవ్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు జయంత్ దత్తా శుక్రవారం రాత్రి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమ త్రిపురలో మాదిరి తూర్పు త్రిపురలో పూర్తిగా రిగ్గింగ్ చేయాలని బిజెపి శతవిధాలా యత్నించినప్పటికీ ఓటర్లు భయపడకుండా ఓటు వేయడం ఒక విజయమని అన్నారు. ముందు రోజు రాత్రి వీధి లైట్లు ఆర్పేసి బిజెపి దుండగులు సృష్టించిన భయానక వాతావరణాన్ని చూస్తే ప్రజలు నిర్భయంగా ఓటు వేయగలరా అన్న అనుమానం కలిగిందని వారు అన్నారు. అన్ని రకాల అవరోధాల నడుమ త్రిపుర ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్దయెత్తున వచ్చి ఈ సవాల్‌ను విజయవంతంగా అధిగమించారని, అందుకు వారిని అభినందిస్తున్నామని అన్నారు. పశ్చిమ త్రిపురలో మాదిరి వందశాతానికి పైగా ఓట్లు పోలైన కేంద్రాలు ఇక్కడ పెద్దగా లేకపోవడం కాసింత ఊరట. అయితే అంబాసోల్ లో మాత్రం 112 శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది. పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది. మొత్తం మీద తూర్పు త్రిపుర నియోజకవర్గంలో 80. 37 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

త్రిపుర పశ్చిమ నియోజకవర్గంలో అక్రమాలపై ఇసికి ఫిర్యాదు

పశ్చిమ త్రిపురలో చాలా చోట్ల బూత్‌లను ఆక్రమించి, రిగ్గింగ్‌కు పాల్పడడంతో వంద శాతానికి పైగా ఓట్లు పోలైనవి ఓ అరడజను దాకా ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూసినప్పుడు మోహన్‌పూర్‌లో 109.09 శాతం, మజ్లిస్‌పూర్‌లో 105.30 శాతం, ఖాయర్‌పూర్‌లో 100.15 శాతం కయిర్ పూర్‌లో 98.80 శాతం ఓట్లు పోలయ్యాయి. భారీగా ఎన్నికల అక్రమాలు చోటు చేసుకున్న పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గంతోబాటు రామ్‌నగర్ అసెంబ్లీ స్థానానికి జరినిన ఉప ఎన్నికను నిలిపేసి తిరిగి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరపాలని సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి కేంద్ర ఎన్నికల సంఘానికి ఇటీవల ఓ లేఖ రాశారు. 109 శాతం ఓట్లు పోలవ్వడమనేది బూత్‌లను స్వాధీనం చేసుకున్నప్పుడు, వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తిగా రిగ్గింగ్ చేసినప్పుడే సాధ్యమని ఆయన అన్నారు. త్రిపురలో బిజెపి నాయకులు ప్రతిపక్షాలపై విషం చిమ్ముతూ చేసిన వ్యాఖ్యలపై చర్య తీసుకోవాలని కోరుతూ ఆయన మరో లేఖ రాశారు. దీనికి ఎన్నికల సంఘం నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లాకు బెయిలు

ఢిల్లీ: ఇటీవల ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ అక్రమాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసిన ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌కు ఊరట లభించింది. ఆయనకు రూ.15 వేల బాండ్, అంత మొత్తానికి వ్యక్తిగత పూచీకత్తుపై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ వక్ఫ్‌బోర్డులో నియామకాలు, ఆస్తుల లీజుకు సంబంధించిన అక్రమాల కేసులో తమ ముందు విచారణకు హాజరుకాకపోవడంతో ఇటీవల ఆయనపై కోర్టుకు ఇడి ఫిర్యాదు చేసింది. శనివారం ఇరువైపులా వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.

హేమంత్ సోరెన్‌కు బెయిల్ నిరాకరణ

రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు రాంచీలోని ప్రత్యేక పిఎంఎల్‌ఎ కోర్టు నిరాకరించింది. తన మేనమామ రాజారాం సోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు 13 రోజుల మధ్యంతర బెయిల్ కోసం హేమంత్ కోర్టును ఆశ్రయించారు. అందుకు బెయిల్ మంజూరు చేసేందుకు ధర్మాసనం నిరాకరించింది. దీంతో ఆయనకు మరోసారి నిరాశే ఎదురయ్యింది.

మనీలాండరింగ్ కేసులో ఇడి అధికారులు అరెస్టు చేయడంతో జనవరి 31 నుంచి హేమంత్ సోరెన్ జైలులో ఉన్నారు.

బిజెపి దివాళాకోరుతనం

- అఖిలేష్ యాదవ్

ఢిల్లీ : ఇప్పటి వరకు జరిగిన రెండు దశల లోక్ సభ ఎన్నికల్లో బిజెపి కనుమరుగైందని, తదుపరి విడతల్లో మరింత దిగజారుతుందని సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం బిజెపి బలహీనంగా ఉందని, మొదటి, రెండు దశల ఎన్నికల్లో ఈ విషయం స్పష్టంగా అర్థమైందని తెలిపారు. ఇండియా కూటమి బలంగా ఉందని తెలిపారు. బిజెపిని ఓడించేందుకు ప్రజలు కంకణం కట్టుకున్నారని వెల్లడించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం బిజెపిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. బిజెపికి పోలింగ్ ఏజెంట్లు కూడా దొరకని పరిస్థితి నెలకొందని వివరించారు.

అమెరికాలో ఘోర ప్రమాదం

- ముగ్గురు భారతీయులు మృతి

సౌత్ కరోలినా : అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. వీరి కారు సౌత్ కరోలినాలోని గ్రీన్‌విల్లే కౌంటీలోని బ్రిడ్జ్ మీదకు రాగానే అదుపు తప్పి బ్రిడ్జి మీద నుంచి 20 అడుగుల పైకి ఎగిరి ఎదురుగా ఉన్న చెట్లను ఢీకొట్టిందని చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందిన రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీషాబెన్ పటేల్ మృతి చెందారని.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అమెరికాలో శ్వేత జాతి దురహంకారానికి మరో నల్లజాతీయుడి బలి

జార్జి ఫ్లాయిడ్ తరహాలో మెడపై మోకాలితో అదిమి ఊపిరి తీశారు

వాషింగ్టన్ : అమెరికాలో శ్వేత జాతి దురహంకారం మరోసారి బుసలు కొట్టింది. నాలుగేళ్ల క్రితం జార్జి ఫ్లాయిడ్‌ను ఎలా అయితే మోకాలితో మెడపై గట్టిగా నొక్కి ఊపిరాడకుండా చేసి చంపారో అదే తరహాలో ఫ్రాంక్ టైసన్ (53) అనే నల్లజాతీయుడిని కాంటన్ పోలీసు అధికారి చంపేశాడు. ఈ ఘటనకు సంబంధించి ఓహియోలోని కేంటన్ పోలీసు విభాగం విడుదల చేసిన బాడీ కెమెరా వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జార్జి ఫ్లాయిడ్‌ను డెరెక్ చావిన్ అనే శ్వేత జాతి పోలీస్ అధికారి తొమ్మిది నిమిషాల సేపు మోకాలితో మెడను అదిమి చంపడం పట్ల ఆనాడు అమెరికా అంతటా నిరసనాగ్రహాలు పెల్లుబికాయి. ఇప్పుడు టైసన్ మెడపై కాంటన్ పోలీస్ అధికారి మోకాలితో ఎనిమిది నిమిషాలసేపు అదిమి ఊపిరాడకుండా చేసి చంపేశారు. టైసన్‌ను చంపిన తీరు చూస్తే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఒక కారు ప్రమాదం కేసులో డ్రైవర్ ప్రమాదం అనంతరం ఒక బార్‌లోకి పారిపోయాడని గుర్తించిన పెట్రోలింగ్ అధికారులు అక్కడకు వెళ్లారు. ఆ బార్ వద్ద నిల్చొని ఉన్న టైసన్‌ను అనుమానించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేశారు. వారు తనను చంపడానికి వస్తున్నారంటూ టైసన్ కేకలు వేయడం ఆ వీడియోలో వినిపిస్తోంది. ఆ తర్వాత పోలీసులు అతడిని నేలపై పడేసి, చేతికి బేడీలు వేశారు. ఒక అధికారి అతడి మెడపై మోకాలితో అదిమిపట్టాడు. ఈ క్రమంలో టైసన్ "నేను ఊపిరి పీల్చుకోలేకపోతున్నాను" అని మొత్తుకోవడం కూడా ఆ వీడియోలో వినిపిస్తోంది. అయినా అధికారులు వినిపించుకోలేదు. అరవద్దు, నోరు మూసుకో అంటూ ఒక అధికారి తిట్టడం కూడా వినిపించింది. దాదాపు ఆరు నిముషాల తర్వాత టైసన్‌లో ఎలాంటి చలనం కనిపించపోవడంతో 'బతికున్నాడా లేదా' అనుకుంటూ పోలీసులు ఆయన చేతికున్న బేడీలు తీసివేసి, సిపిఆర్ చేయడం వీడియోలో కనిపించింది. ఆ వెంటనే స్థానిక ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే ఆయన మరణించారు. ఈ ఘటనపై వ్యాఖ్యానించేందుకు ఓహియో పోలీసులు నిరాకరించారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించామని మాత్రమే చెప్పారు. .టైసన్ మృతికి కారకులైన ఇద్దరు పోలీస్ అధికారులను సెలవుపై పంపించేసినట్లు తెలుస్తోంది.



టైసన్‌ను నేలపై పడేసి, చేతికి బేడీలు వేసి మెడపై మోకాలితో అదిమిపట్టిన పోలీసులు

పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో మహిళా ప్రొఫెసర్‌పై దాష్టీకం

పాలస్తీనాకు అనుకూలంగా నిరసనలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. అమెరికాలోని అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీలో ఓ మహిళా ప్రొఫెసర్‌ను పోలీసులు కిందపడేసి ఆమె చేతికి బేడీలు వేశారు. ప్రొఫెసర్ కరోలిన్ ఫెలిన్‌ను కింద పడేసి, ఆమె రెండు చేతులను హ్యాండ్‌కప్‌తో కట్టేశారు. విద్యార్థులను వదిలేయాలని ఆమె వేడుకున్నది. ఆ సమయంలో ఓ పోలీసు వచ్చి ఆమెను నెట్టేశాడు. ఇక ఆ తర్వాత మరో పోలీసు వచ్చి కిందపడేసి చేతులకు జిప్ వేశారు. నేను ప్రొఫెసర్‌ను అంటూ ఆమె అరిచినా పట్టించుకోలేదు. పాలస్తీనాకు అనుకూలంగా కొలంబియా యూనివర్సిటీలో తొలుత నిరసన ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి.

నవాజ్ షరీఫ్‌కే పార్టీ పగ్గాలు!

లాహోర్ : మూడుసార్లు ప్రధానిగా వ్యవహరించిన పాకిస్తాన్ ముస్లింలీగ్ (ఎన్) నేత నవాజ్ షరీఫ్ వచ్చే నెల 11న తిరిగి పార్టీ పగ్గాలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు ఆయనను ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించిన నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవిని వదిలిపెట్టి ఆయన లండన్‌కు ప్రవాసం వెళ్లారు. పాక్ రాజకీయాలను శాసిస్తున్న సైన్యంతో రాజీ కుదుర్చుకోవడం ద్వారా కేసులను మాఫీ చేసుకుని గత ఏడాది తిరిగి దేశంలోకి అడుగుపెట్టారు. ఏడేళ్ల విరామం తర్వాత తిరిగి పార్టీ పగ్గాలు చేపట్టబోతున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

జయరాజన్‌పై ఆరోపణలు అర్థరహితం

- పినరయి విజయన్

తిరువనంతపురం : ఎల్‌డిఎఫ్ కన్వీనర్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఇ.పి.జయరాజన్‌పై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. బిజెపి నేత ప్రకాష్ జావేద్‌కర్‌తో జయరాజన్ సమావేశంపై బిజెపి, కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమైనవని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇటువంటి తప్పుడు ఆరోపణలు రావడం సర్వ సాధారణమని, ప్రజలు దీన్ని అర్థం చేసుకోగలరని అన్నారు. జయరాజన్‌ది అద్భుతమైన రాజకీయ జీవితమని, అది ప్రతి ఒక్క కమ్యూనిస్టుకు స్ఫూర్తిదాయకంగా వుంటుందన్నారు. సిపిఎం నేతలను అప్రతిష్టపాల్జేసే ఉద్దేశంతో బిజెపి నేత కె.సురేంద్రన్, కెపిసిసి అధ్యక్షుడు కె.సుధాకరన్‌లు ఒకేలా మాట్లాడుతున్నారన్నారు. జయరాజన్‌కు ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు వున్నాయని, ఇతరులతో సంబంధాలు కొనసాగించేటపుడు చాలా జాగ్రత్తగా వుండాలన్నారు. ఆయన ఆ జాగ్రత్త పాటించలేదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. జావేద్‌కర్‌ను సమావేశమవడంలో ఎలాంటి తప్పు లేదని, ఒక ప్రజా కార్యక్రమంలో తాను కూడా ఆయనను కలిశానని విజయన్ చెప్పారు.

ఈ వివాదంపై జయరాజన్ స్పందిస్తూ, దీని వెనుక ఏదో కుట్ర వుందన్నారు. ' మా అబ్బాయి ఫ్లాట్ కారిడార్‌లో ఆయన నడుచుకుంటూ వెళుతుంటే చాలా యాదృచ్ఛికంగా నేను ఆయనను కలిశాను. రాజకీయాల గురించి మేమెన్నడూ చర్చించుకోలేదు." అని స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్ ప్రతిపాదనపై స్పందిస్తాం

- హమాస్ వెల్లడి
- గాజా దాడుల్లో 32మంది మృతి

గాజా : గాజాలో కాల్పుల విరమణపై తాము తాజాగా చేసిన ప్రతిపాదనకు ఇజ్రాయిల్ నుండి ప్రతిస్పందన అందిందని హమాస్ తెలిపింది. దీనిపై కూలంకషంగా అధ్యయనం చేసిన తర్వాత సమాధానం పంపుతామని పేర్కొంది. ఈ నెల 13న ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులు అందచేసిన ప్రతిపాదనలకు ఇజ్రాయిల్ అధికారికంగా స్పందించిందని డిప్యూటీ గాజా చీఫ్ ఖలీల్ అల్ హయ్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజాలో గత ఆరు మాసాలకు పైగా సాగుతున్న యుద్ధం నేపథ్యంలో కాల్పుల విరమణపై జరుగుతున్న చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఇజ్రాయిల్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా ఈ యుద్ధానికి ముగింపు పలకాలని హమాస్ పట్టుబడుతోంది. ఈ పరిస్థితుల్లో చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మార్గాలను అన్వేషించేందుకు శుక్రవారం ఈజిప్ట్ ప్రతినిధి బృందం ఇజ్రాయిల్ వెళ్ళింది. కాగా ఆ చర్చల అనంతరం ఇజ్రాయిల్ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ, కొత్తగా తాము ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని చెప్పారు. అయితే తాత్కాలికంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకునే విషయాన్ని పరిశీలించడానికి సుముఖంగా వున్నామని చెప్పారు. తమ ప్రజల అవసరాలు, హక్కులను పరిగణనలోకి తీసుకుని ఏ ఆలోచనలు లేదా ప్రతిపాదనలైనా పరిశీలిస్తామని హమాస్ కూడా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాఫా నగరంపై పదాతిదళం దాడితో ముందుకు సాగేలోగా ఒక అవకాశంగా బందీల విడుదలపై చర్చలకు సిద్ధంగా వున్నామని ఇజ్రాయిల్ చెబుతోంది.

ఇజ్రాయిల్ దాడుల్లో శనివారం ధ్వంసమైన తమ ఇంటి వద్ద తమ వస్తువుల కోసం వెతుకుతున్న చిన్నారులు

32మంది పాలస్తీనియన్లు మృతి, 34,388కి పెరిగిన మరణాలు

గాజాలో శుక్రవారం జరిగిన దాడుల్లో 32మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇజ్రాయిల్ అమానుష హత్యాకాండలో ఇప్పటివరకూ మరణించిన పాలస్తీనా వాసుల సంఖ్య 34,388కి పెరిగినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. 77,437 మంది తీవ్ర గాయాల పాలైనట్లు పేర్కొంది. సెంట్రల్ గాజాలోని నస్రత్ శిబిరంలో గల నివాస భవనాలపై దాడుల నేపథ్యంలో ఆ శిధిలాల కింద చిక్కుకున్నవారిని వెలికితీసేందుకు అత్యవసర సహాయ బృందాలు శ్రమిస్తున్నాయి. గాజాలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో అక్కడి పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏ మాత్రమూ సురక్షితం కాని తాగునీటిని ప్రజలు తాగుతున్నారు. తీవ్రమైన వేడిమిని భరించలేక ఒక చిన్నారి తాజాగా మరణించింది. మరోవైపు అమెరికన్ యూనివర్శిటీల్లో కొనసాగుతున్న పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు యూరప్ ప్రాంతాలకు కూడా విస్తరించాయి.

అమేథీ నుంచి రాహుల్, రాయబరేలి నుంచి ప్రియాంక!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి రాహుల్‌గాంధీని, రాయబరేలి నుంచి ప్రియాంకగాంధీని పోటీకి నిలపాలని కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రతిపాదించగా, వారిద్దరూ అంగీకరించారు. ఈ అంశంపై పార్టీ అధ్యక్షుడు ఖర్గే తుది నిర్ణయం తీసుకోనున్నారు. అమేథీ, రాయబరేలికి చెందిన పార్టీ విభాగం నేతలతో కేంద్ర నాయకత్వం శనివారం సాయంత్రం ఢిల్లీలో సమావేశమైంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సిఇసి) సమావేశమై అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. అమేథీ, రాయబరేలి నియోజకవర్గాల్లో మే 20న ఎన్నికలు జరుగనున్నాయి. అమేథీ నుంచి రాహుల్ గాంధీ, రాయబరేలి నుంచి ప్రియాంక గాంధీ వాద్రా నామినేషన్లు వేసే ముందు అయోధ్యలోని రామ మందిరాన్ని దర్శించనున్నట్టు చెబుతున్నారు. రాహుల్ గాంధీ ఇప్పటికే కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీలో ఉండగా, రెండో సీటుగా అమేథీ నుంచి కూడా పోటీకి దిగనున్నారు. మూడోసారి బిజెపి తరపున పోటీలో ఉన్న స్మృతి ఇరానీతో ఆయన తలపడనున్నారు. ప్రియాంక గాంధీ రాయబరేలి నుంచి పోటీ చేయడం ఇదే మొదటిసారి .

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి..

- ఇద్దరు జవాన్లు మృతి

మణిపూర్ : మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లా నారసేన ప్రాంతంలో భద్రతా బలగాలపై సాయుధ మిలిటెంట్లు దాడి చేశారు. శనివారం తెల్లవారు జామున సిఆర్‌పిఎఫ్ 128వ బెటాలియన్ పర్యవేక్షణలో ఉన్న సెక్యూరిటీ ఔట్ పోస్టుపై బాంబు దాడి చేశారు. ఈ దాడిలో సిఆర్‌పిఎఫ్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఎన్ సర్కార్, హెడ్ కానిస్టేబుల్ అరూప్ సైనీ మరణించారని, ఇన్‌స్పెక్టర్ జాదవ్ దాస్, కానిస్టేబుల్ ఆఫ్తాబ్ హుస్సేన్‌లకు గాయాలయ్యాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

కాల్పుల్లో గ్రామ వాలంటీర్ మృతి

కాంగ్‌కోపి, ఇంఫాల్ తూర్పు జిల్లాల సరిహద్దుల్లోని సినామ్ కోమ్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో గ్రామ వాలంటీర్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. 33 ఏళ్ల గ్రామ వాలంటీర్ లైశ్రామ్ ప్రేమ్ బుల్లెట్ గాయాలతో మరణించాడని, అతని మృతదేహాన్ని లోయలో నుంచి శనివారం ఉదయం వెలికితీశామని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
पटमट ब्रांच / Union Bank of India — Andhra, Corporation
పటమట బ్రాంచ్, విజయవాడ-520010. ఫోన్ : 0866-2476442

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకంగా తెలుపునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటార్ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ తెలిపిన స్థిరాస్తి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పటమట బ్రాంచ్,** (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే దిగువ ఋణగ్రహీతలు & హామీదారుల నుండి **స్వాధీనం** తీసుకొనబడినవి. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పటమట బ్రాంచ్** వారికి చెల్లించవలసిన బకాయి సొమ్ము **తేది.07.04.2023 నాటికి రూ. 18,58,828.68 పై. (అక్షరాలా పద్దెనిమిది లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఇరవై ఎనిమిది రూపాయల అరవై ఎనిమిది పైసలు మాత్రమే)** + వడ్డీ & ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం రాబట్టుకొనుటకు సదరు స్థిరాస్తులను **తేది.14.05.2024** న అధీకృత అధికారిచే **"ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నా అలాగే"** పద్ధతిలో విక్రయం చేయుటకు నిర్ణయించినారు. **ఋణగ్రహీత, సహ-దరఖాస్తుదారు & హామీదారుల యొక్క పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ తేలు రాధాకృష్ణ,** అసిస్టెంట్ మేనేజర్, ఐఎఫ్‌ఎఫ్‌సిఐ టొక్యో, ఎమ్‌జి రోడ్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ-520010. **శ్రీ తేలు రాధాకృష్ణ, తండ్రి : రామచంద్రరావు,** డోర్ నెం.6-139, ఫ్లాట్ నెం.జిఎఫ్-4, గ్రౌండ్ ఫ్లోర్, సాయి రమ్య రెసిడెన్సీ, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, విజయవాడ రూరల్. **శ్రీ తేలు రాధాకృష్ణ,** 46-10-29, చిన్న గాంధీ బొమ్మ వీధి, దానవాయిపేట, రాజమండ్రి-533103, ఆం.ప్ర., **శ్రీ తేలు రాధాకృష్ణ, తండ్రి : రామచంద్రరావు,** డి.నెం.20-16-52, కరణం వారి వీధి, తుమ్మలోవ, రాజమండ్రి అర్బన్, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర. **2.శ్రీమతి తేలు లావణ్య, భర్త : రాధాకృష్ణ,** 20-16-52, ఎస్‌ఎఫ్3, సాయి రమ్య అపార్ట్‌మెంట్స్, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ-520008. **శ్రీమతి తేలు లావణ్య, భర్త : రాధాకృష్ణ,** డోర్ నెం.6-139, ఫ్లాట్ నెం.జిఎఫ్-4, గ్రౌండ్ ఫ్లోర్, సాయి రమ్య రెసిడెన్సీ, బిఎమ్‌పిఎస్ రోడ్, ప్రసాదంపాడు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, విజయవాడ రూరల్.

వేలం తేది మరియు సమయం : 14.05.2024, ఉదయం 10.00 గ॥ నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు, (10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పణ : ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

విక్రయము జరుపుటకు నిర్ణయించిన స్థిరాస్తి యొక్క సంక్షిప్త వివరములు

విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, డోర్ నెం.6-139, ఆర్ ఎస్ నెం.74/7 వద్ద మొత్తము 469 చ॥గ॥ల స్థలములో నిర్మించబడిన శ్రీ సాయి రమ్య రెసిడెన్సీ నందు 30 చ॥గ॥ల అవిభాజ్యపు వాటాతో సహా ప్లింత్ ఏరియా 680 చ॥అ॥లు, బాల్కనీ 100 చ॥అ॥లు, ఉమ్మడి ఏరియా 135 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ & టూ వీలర్ పార్కింగ్ ఏరియా 125 చ॥అ॥లతో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో గల ఫ్లాట్ నెం.జిఎఫ్-4 యావత్తు ఆస్తి **శ్రీ తేలు రాధాకృష్ణ** గారికి చెందినది. **స్థలం హద్దులు: తూర్పు:** ఉప్పల లక్ష్మి గారి ఆస్తి, **దక్షిణం:** వల్లంటి సరోజిని, దొడ్డి లోకనాథం గార్ల ఆస్తి, **పడమర:** 30 అ॥ల వెడల్పు రోడ్, **ఉత్తరం:** బండి లక్ష్మీ కుమారి గారి ఆస్తి. **ఫ్లాట్ హద్దులు: తూర్పు:** లిఫ్టు మరియు ఉమ్మడి వరండా, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : రూ. 19,89,000/- **ధరావత్తు : రూ. 1,98,900/-** **బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-**

ఇ-వేలమునకు సంబంధించిన తదుపరి వివరములు సవివరమున నియమ నింబంధనలు కొరకు దయచేసి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి వెబ్ సైట్ అనగా **www.unionbankofindia.co.in, www.mstcecommerce.com, www.ibapi.in** ను సందర్శించగలరు.

అధీకృత అధికారి వారికి ఉన్న సమాచారం మేరకు ఆస్తిపై ఎటువంటి ఎన్‌కంబరెన్స్‌లు లేవు. ఆసక్తి గల బిడ్డరు వేలం యొక్క పూర్తి వివరములు మరియు ఆస్తి తనిఖీ చేసుకొనేందుకు **అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్** గారిని పైన తెలిపిన తేదిన సంప్రదించవచ్చును. సంప్రదించవలసిన **మొబైల్ నెం.70107 27336 (మొబైల్), టెలిఫోన్ నెం.0866-2476442, ఇ-మెయిల్: ubin0804240@unionbankofindia.bank, పటమట బ్రాంచ్, హై స్కూల్ రోడ్డు, విజయవాడ-520010.**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) / రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు నోటీసు

ఈ నోటీసు ప్రకటన పై లోనుకు సంబంధించిన ఋణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) రూల్ 9(1) ల క్రింద పైన తెలిపిన తేదీన వేలం ద్వారా అమ్మకం జరుపబడునని తెలియజేస్తూ ఇచ్చిన ప్రకటనగా కూడా పరిగణించవలెను.

తేది: 25.04.2024, ప్రదేశం : పటమట — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పటమట బ్రాంచ్

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

R.P. No.402 of 2019 in OA No. 473 of 2017
కెనరా బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచ్, గుంటూరు
వర్సెస్
M/s. శ్రీనివాస కాటన్ ట్రేడర్స్

విషయం: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా 14.02.2024 తేదీతో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ప్రకారం https://www.bankeauctions.com వెబ్‌సైట్‌లో 30.03.2024వ తేదీన జరుపవలసిన షెడ్యూల్-సి మరియు షెడ్యూల్-జె ఆస్తుల ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం తేది 27.03.2024 నాటి వాయిదా ఉత్తర్వుల ప్రకారం 26.04.2024 నకు వాయిదా వేయడమైనది. బిడ్లు రానందున, సిహెచ్‌ఆర్ బ్యాంక్ యొక్క అభ్యర్ధన మేరకు వేలం మరొకసారి **17.05.2024 నకు వాయిదా వేయడమైనది. ధరావత్తు మరియు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది 15-05-2024 మరియు బిడ్స్ హార్డ్‌కాపీలను సమర్పించుటకు ఆఖరు తేది 16-05-2024.** తేది 14.02.2024 తో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ఇతర నియమనిబంధనలలో ఏ మార్పు లేదు.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది. 24-04-2024 న జారీచేయడమైనది)
(బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు)
రికవరీ ఆఫీసర్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking — సిండికేట్ Syndicate
కార్ల్‌మార్క్స్ రోడ్డు బ్రాంచ్ (13750)
32-26-55/7, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ. ఫోన్: 7382616743.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ శ్రీనివాసరావు సందు మరియు శ్రీమతి సునీత సందు** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ.21,68,622.71 పై॥ (అక్షరాల ఇరవై ఒక్క లక్షల అరవై ఎనిమిది వేల ఆరు వందల ఇరవై రెండు రూపాయలు మరియు డబ్బై ఒక్క పైసలు మాత్రమే)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **30.01.2024 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **22-04-2024 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 21.04.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 22,32,060.84** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

షెడ్యూల్-బి: కృష్ణా జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ, కానూరు గ్రామం, ఆర్.ఎస్. నెం. 154/1, 157/A,B, ఫ్లాట్ నెం.175 మొత్తం 333.3 చ॥గ॥ లేదా 278.6 చ॥మీ॥లలో అవిభాజ్యపు ఉమ్మడి వాటా 27.0 చ॥గ॥ లేదా 22.57 చ॥మీ॥ స్థలం. హద్దులు: తూర్పు: 33.0 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: ఫ్లాట్ నెం.174, పడమర: ఫ్లాట్ నెం.170, ఉత్తరం: ఫ్లాట్ నెం.176. **షెడ్యూల్-బి:** పైన తెలిపిన ఎ-షెడ్యూల్ **"శ్రీ సాయి మౌనిక టవర్స్", 2వ అంతస్తులో** ప్లింత్ ఏరియా 600 చ॥అ॥, ఉమ్మడి ఏరియా 100 చ॥అ॥ మరియు పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥ కలిగి అన్ని సౌకర్యాలతో నున్న ఫ్లాట్ నెం. SF-**1. హద్దులు:** తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: లిఫ్ట్, మెట్లు మరియు ఉమ్మడి వరండా, ఉత్తరం: ఈ ఫ్లాట్‌కి మరియు ఫ్లాట్ నెం. SF-2 మధ్య ఉమ్మడి గోడ.

తేది: 22.04.2024, ప్రదేశం:విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/1049/2019 — 15.03.2024

Canara Bank (e-Syndicate Bank), Labbipeta Branch, Vijayawada, Krishna District
Versus
M/s Sparkle Garments Industries

To
(CD-1) M/s Sparke Garments Industries, Rep. By its Prop Sri. Konda Ramesh, D No. 5-58, Near MRO Office, Dwaraka Tirumala, West Godavari District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/380/2017** an amount of **Rs. 22,12,783.12 Ps (Rupees twenty two lakhs twelve thousand seven hundred eighty three and twelve paisa only)** along with pendentallite and future interest @ 12.50% p.a compounded with monthly rests from 15.05.2017 till realization / date of payment and the costs of Rs. 41,000/- (Rupees forty one thousand only) has become due against you (Jointly and severally /Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **29.04.2024** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:

16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.

16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment

(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 15th March 2024)
(Avasarala Anil), Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

మీ కోసం

నాన్‌స్టిక్ పాన్ బాగా నల్లగా మారినప్పుడు గుడ్డు పెంకులను మిక్సీ జార్‌లో పొడి చేసుకుని దానిపై పూయాలి. ఈ పొడి మీద డిటర్జెంట్ నీళ్లు పోసి పది నిమిషాల తరువాత రుద్దితే పాన్ తెల్లగా మారుతుంది.

జీవన సౌరభం

మేధావులు మౌనంగా ఉన్నంత కాలం మూర్ఖులు రాజ్యమేలుతారు.

చెట్లు పెంచుదాం!

పెరుగుతోంది పెరుగుతోంది భూతాపం
కరుగుతోంది కరుగుతోంది హిమాచలం
కదం తొక్కి కదలాలీ యువతరం
పదం కలిపి పాడాలి యువగళం

ఉదాసీనతనే వదిలి పెట్టుదాం
ఉదారంగు మొక్కలనే నాటుదాం
చలిమరల వాడకాన్నే తగ్గిద్దాం
చల్లని తరుల ఛాయనే శయనిద్దాం

చెట్లే కదా మన జీవన ఆధారం
చెట్లే కదా మన ప్రగతి సోపానం
చెట్లే కదా మన జగతి ఆహ్లాదం
చెట్లే కదా మన ఆరోగ్య రహస్యం

అందుకే ...
నేడే మనం ప్రతిన పూనుదాం
వృక్షో రక్షతి రక్షితః అని నినదిద్దాం!

- గుండాల నరేంద్ర బాబు,
94932 35992.

లెక్క తేల్చండి



పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 68

నేను గీసిన బొమ్మ

- కింతాడ లోకేష్,
4వ తరగతి,
ఎంపీపీఎస్
గొంపవానిపాలెం,
కే కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సముద్రంలో సాహసం!

'విజయానికైనా, వైఫల్యానికైనా ఒకటే దారి వుంటుంది. మన మీద మనకు ఉన్న నమ్మకం.. శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలపై మనం చేసే అభ్యాసమే వాటి మధ్య వ్యత్యాసాన్ని చూపుతుంది' అంటున్నారు తమిళనాడుకు చెందిన భరత్ సచిదేవ్, శాశ్వత్ శర్మ. ఈ ఇద్దరు స్నేహితులు ఈ నెల 14న శ్రీలంక సరిహద్దు నుంచి 32 కిలోమీటర్ల సముద్రమార్గాన్ని 10 గంటల 30 నిమిషాల వ్యవధిలో ఈదారు. ఇది అంత ఆషామాషీగా జరగలేదు. మార్గమధ్యలోప్రాణాలను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. అయినా, పట్టు విడవలేదు. అనిశ్చల జల ప్రవాహంలో విపరీతమైన వేడితో ఒళ్లంతా బొబ్బలెక్కుతున్నా తమ లక్ష్యాన్ని సాధించేవరకూ ప్రయత్నం వదలేదు. ఆఖరిగా తాము అనుకున్న అపూర్వ రికార్డు సృష్టించారు.

సాహసోపేత ప్రయాణం ముగించిన వేళ.. ధనుష్కోటి తీరంలో..

'అడ్వెంచర్ స్పోర్ట్స్, బహిరంగ ఈత'ను భారతదేశ నలుమూలలా విస్తరింప చేయాలని ఈ స్నేహితులు బలంగా కోరుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ అడ్వెంచర్‌కి తెరతీశారు. 2024 ఏప్రిల్ 14న శ్రీలంక తలైమన్నార్ ప్రాంతం ఈ అద్భుతానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ఆ రోజు ఉదయం 4 గంటల నుంచి.భద్రతా చర్యలను పర్యవేక్షిస్తూ ఓ బృందం అటూఇటూ హడావిడిగా తిరుగుతూ ఉంది. సరిహద్దు చట్టాలకు చెందిన అనుమతి పత్రాలను భద్రంగా దగ్గర పెట్టుకుంది. ఇంత హడావిడిలోనే స్నేహితులిద్దరూ ఎంతో ప్రశాంతంగా సముద్ర అలలవైపు తీక్షణంగా చూస్తూ కూర్చొన్నారు. మరికొద్ది క్షణాల్లో ఓ సాహసోపేత ప్రయాణానికి సిద్ధమవుతున్న వారిలో ఏమాత్రం ఆందోళన కనిపించడం లేదు. చాలా ఉల్లాసంగా ఆ క్షణాలను ఆస్వాదిస్తున్నారు.

ఉదయం 5 గంటలకు సాహసయాత్ర మొదలైంది. ఆ సమయానికి కొన్ని గంటల ముందే ధనుష్కోటి నుంచి శ్రీలంకకు పడవ మార్గంలో వారు అక్కడికి చేరుకున్నారు. రాత్రంతా పడవలో ప్రయాణించడం వల్ల విపరీతమైన అలసట వారిని ఆవహించింది. విశ్రాంతి తీసుకున్నా ఆ అలసట వారిని వదల్లేదు. 15 గంటలు నిర్విరామంగా పడవ మార్గంలో ప్రయాణించిన కొన్ని గంటల వ్యవధిలోనే జలసంధిలో ఈదేందుకు సిద్ధమయ్యారు. 32 కిలో మీటర్ల పొడవున్న ఆ మార్గంలో వారికి సహాయసహకారాలు

అందించేందుకు నేవీ అధికారులు, ఈతగాళ్లు పక్కనే బోటులో బయల్దేరారు. మధ్యలో వారికి పోషకాహారం అందించే ఏర్పాట్లు కూడా చేశారు.

ఈ ఫీట్‌కి ముందు ఈ మిత్రులు ఇద్దరూ భిన్న జల ప్రవాహాలు, వాతావరణ పరిస్థితుల మధ్య ఈదడంలో శిక్షణ పొందారు. నీటి రక్షణ, ప్రమాదాల నుంచి ఎలా కాపాడుకోవాలి అనే దానిపై ప్రత్యేక తర్ఫీదు తీసుకున్నారు.

'పొరుగుదేశాల మధ్య స్నేహభావాన్ని పెంపొందించుకోవాలంటే ఇలాంటి సాహసయాత్రలకు సిద్ధం కావాలి. చాలామంది సాహస యాత్రికులు ఎంతో కష్టతరమైన ప్రదేశాలకు వెళుతుంటారు. అయితే రామసేతు కూడా ఎంతో కష్టతర ప్రయాణం. చాలా తక్కువ మందే ఈ సాహసానికి సిద్ధమవుతారు. ప్రపంచ పటంలో రామసేతును ప్రత్యేకంగా నిలపాలని మేం కోరుకున్నాం. అందుకే ఈ సాహసానికి తెరతీశాం' అంటూ తమఉద్దేశాన్ని మిత్రులిద్దరూ ముక్తకంఠంతో చెబుతున్నారు.

హెల్త్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్‌గా, అంతర్జాతీయ ఈతగాడిగా, ఐరన్‌మాన్ ట్రైయథ్లెట్‌గా భరత్ (40) పేరు చాలామంది క్రీడాకారులకు పరిచయమే. మేరీ కోమ్, అమిత్ పంఘాల్, వికాస్ క్రిష్ణన్ వంటి అనేకమంది ప్రముఖ క్రీడాకారులకు భరత్ వెల్‌నెస్ కన్సల్టెంట్‌గా పనిచేశారు. టోక్యో ఒలింపిక్స్‌కి సిద్ధమవుతున్న భారతీయ బాక్సింగ్ బృందానికి కూడా భరత్ శిక్షణ ఇచ్చారు.

ఆర్కిటెక్‌గా ఉన్న శాశ్వత్ శర్మ (31), పొడవైన ప్రాంతాలను అవలీలగా ఈదగలిగిన ఈతగాడిగా ప్రసిద్ధిచెందాడు. ట్రైయథ్లెట్, జాతీయ వాటర్ పోలో క్రీడాకారుడిగా 500 పతకాలను, ట్రోఫీలను తన ఖాతాలో వేసుకున్న దిగ్గజ ఆటగాడు.

ఈ ఇద్దరూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తమ సత్తా చాటినవారే. అయితే ఏదో వెలితి వారిని వెంటాడింది. ఆశించినంత మంది క్రీడాకారులు బహిరంగ స్విమ్మింగ్‌వైపు రావడం లేదన్న మనోవేదన వారిని బాధించింది. అందుకే 'బహిరంగ ఈతకు భారత్‌లో వీలుంది' అని ప్రపంచానికి తెలిసేలా ఈ మార్గాన్ని ఎంచుకున్నారు.

వారి ప్రయాణం ఇలా సాగింది..

ప్రయాణం మొదలుపెట్టిన రోజు వాతావరణం చాలా ఇబ్బందికరంగా ఉంది. సముద్రగాలులు బలంగా వీచాయి. 'ఆ రోజు కొంతదూరం ఈదిన తరువాత మాకు శ్వాస ఆడలేదు. సముద్రం ఉపరితలం మాకు వ్యతిరేకంగా ఉంది. కొన్నిసార్లు మేము చావు అంచుల వరకు వెళ్లినట్లు భావించాం. కానీ భవిష్యత్తు తరాలు మా మార్గాన్ని అనుసరించాలంటే మేము ఈ సాహసం చేయాల్సిందేనని బలంగా అనుకున్నాం. ఎటువంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదని నిశ్చయించుకున్నాం' అంటున్న ఈ స్నేహితులు తమ లక్ష్యాన్ని చేరుకునే చివరిగంటలో తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఒళ్లంతా కాలిపోతున్నంత బాధను అనుభవించారు. ప్రవాహంలో లేని నీరు బాగా వేడెక్కి ఉంది. ఈ ప్రతికూలతల్లో క్రమంగా శక్తిని కోల్పోయారు. శరీరం సహకరించేందుకు నిరాకరిస్తున్నా, మానసికంగా ధైర్యాన్ని కోల్పోలేదు. ఆ శక్తే వారిని అనుకున్న లక్ష్యానికి చేర్చింది.

'మేము సాధించిన ఈ ఘనత, బహిరంగ ఈతపై దేశ యువత శ్రద్ధ పెట్టేలా పిలుపునిచ్చింది. తీరానికి చేరుకున్న క్షణాన, ధనుష్కోటి వద్ద వందలాది మంది యువతీ యువకులు మాకు స్వాగతం పలికారు. 'కలలు కనేందుకు సిద్ధంగా ఉండండి. పెద్ద కలలే కనండి. మీ అభిరుచిని అనుసరించండి. మీ ఆశలను విస్తరించడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించండి. సాయమందించే వారు ఎప్పుడూ ముందుంటారు' అని మిత్రులిద్దరూ యువతకు పిలుపునిచ్చారు. 'మా మార్గంలో ఔత్సాహిక క్రీడాకారులు ముందుకు వచ్చిన రోజున మేము నిజమైన విజయం సాధించినట్లు' అని వారు పేర్కొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన సిపిఎం ప్రతినిధి బృందం

భువనగిరి మినహా తెలంగాణలో
కాంగ్రెస్‌కు సిపిఎం మద్దతు

- సిఎం రేవంత్‌రెడ్డితో సిపిఎం నేతల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం తెలంగాణ సిపిఎం ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో సిఎంతో పాటు మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై వారు చర్చించారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పరస్పరం వారు అభిప్రాయాలు, అంచనాలను నివేదించుకున్నారు.

భువనగిరిలో పోటీ.. మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు : తమ్మినేని

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు సిపిఎం ప్రతినిధివర్గం చర్చించడానికి వెళ్లిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సిపిఎం పోటీని విరమించుకోవాలని, కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మిగతా 16 సీట్లలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. భువనగిరిలో సిపిఎంకు కాంగ్రెస్ మద్దతివ్వాలని కోరారు. బిజెపి, ఇతర శక్తులు గెలవకుండా ఉండాలంటే సిపిఎం పోటీ నుంచి విరమించుకుని కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని, అందుకు సిఎం కొన్ని ప్రతిపాదనలు పెట్టారని చెప్పారు. వాటిపై తాము ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. పోటీలో కొనసాగాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. తమ నిర్ణయంలో మార్పు జరగాలంటే సిపిఎం కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలో చర్చించాల్సి ఉంటుందన్నారు. ఆ నిర్ణయాన్ని తర్వాత తెలియజేస్తామని చేశారు. మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు.

సిపిఎం సహకారంతో ముందుకెళ్తాం : రేవంత్‌రెడ్డి

చర్చల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరామన్నారు. మరికొన్ని రాజకీయ ప్రతిపాదనలను వారి ముందు పెట్టామని వివరించారు. బిజెపి శక్తులను ఓడించేందుకు రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఇండియా వేదికతో కలిసి పనిచేస్తామన్నారు. ఒకట్రెండు విషయాల్లో సందిగ్ధత ఉన్నా అధిష్టానంతో చర్చించి ఆదివారంలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నాని చెప్పారు. సిపిఎం సహకారంతో భవిష్యత్‌లో ముందుకెళ్తాన్నారు. ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు తోడ్పడుతుందన్నారు.

మోడీ హయాంలో పెచ్చరిల్లిన నిరుద్యోగం

- ప్రియాంక గాంధీ

లాతూర్ : మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం రేటు విపరీతంగా పెరిగిపోతోందని, ధరలకు రెక్కలు వస్తున్నాయని, ద్రవ్యోల్బణం అధికమవుతోందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా విమర్శించారు. లాతూర్ జిల్లా ఉద్గిర్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో గత పదేళ్లుగా 30లక్షల పోస్టులు ఖాళీగా పడివున్నాయని, వాటిల్లో ఒక్కదాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. దాదాపు 70కోట్ల మంది ప్రజలు నిరుద్యోగులుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ వ్యవసాయ పరికరంపైనా జిఎస్‌టి విధించారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని తెలిపారు.

ఎన్నికల తర్వాత అదృశ్యం

- ఇండియా బ్లాక్‌పై మోడీ అక్కసు

కొల్హాపూర్ : ఈ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్ అదృశ్యమైపోతుందంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఆ పార్టీలపై అక్కసు వెళ్లగక్కారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలనేవి అభివృద్ధి చెందిన భారత్ మిషన్‌కు సంబంధించినవని అన్నారు. 'ఒక ఏడాదికి ఒక ప్రధాని' అంటూ ప్రతిపక్ష బ్లాక్ పెట్టుకోబోయే ఫార్ములాను ఈ దేశ ప్రజలు సహించలేరని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లు సామాజిక న్యాయాన్ని హత్య చేసేందుకు కంకణం కట్టుకున్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. తమిళనాడులోని డిఎంకె సనాతన ధర్మంపై దాడి చేస్తుంటే వారిని మహారాష్ట్రకు ఆహ్వానించి గౌరవించారని మోడీ అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి: సునీత కేజ్రీవాల్

న్యూఢిల్లీ : నియంతృత్వాన్ని ఓడించేందుకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు వేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తూర్పు ఢిల్లీలోని కొండ్లి ఏరియాలో శనివారం నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు కట్టించి, ఉచితంగా విద్యుత్‌ను అందించినందుకు, ప్రజా క్లినిక్‌లను ప్రారంభించినందుకు కేజ్రీవాల్‌ను జైలు పాలు చేశారని విమర్శించారు. కేజ్రీవాల్‌ను వారేమీ చేయలేరని వ్యాఖ్యానించారు.

ఇడిని కేంద్రం దుర్వినియోగం చేస్తోంది

- సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ అఫిడవిట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కోర్టు ఇడిని సమాధానం కోరింది. తాజాగా ఇడి దాఖలు చేసిన అఫిడవిట్‌పై కేజ్రీవాల్ రిజయిండర్ దాఖలు చేశారు. ఇడిని కేంద్ర ప్రభుత్వం ఎలా దుర్వినియోగం చేస్తుందనడానికి తన అరెస్టే నిదర్శనమని తాజా అఫిడవిట్‌లో కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలకు సమాన పోరాట స్థాయి కల్పించాలన్న ఆయన.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి రాకముందే తనను అరెస్టు చేసిన తీరు ఇడి ఏకపక్ష వైఖరిని తెలియజేస్తుందన్నారు.



పురుషుల టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలతో భారత ఆర్చర్లు

కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం నెగ్గిన అభిషేక్ వర్మ-జ్యోతిసురేఖ

చరిత్ర సృష్టించిన భారత ఆర్చర్లు

ప్రపంచకప్ ఆర్చరీలో మూడు స్వర్ణాలు కైవసం

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో భారత ఆర్చర్లు అదరగొట్టారు. కాంపౌండ్ మిక్స్‌డ్, పురుషుల టీమ్ ఈవెంట్, మహిళల టీమ్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కాయి. దీంతో ఒకేరోజు భారత ఆర్చర్లు హ్యాట్రిక్ స్వర్ణాలతో సత్తా చాటారు. మిక్స్‌డ్ డబుల్ ఈవెంట్, మహిళా జట్టు గోల్డ్ మెడల్స్ సాధించడంలో తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కీలక పాత్ర పోషించింది. శనివారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ-అభిషేక్ వర్మ జోడి 158-157 తేడాతో ఎస్తోనియా జట్టుపై విజయాన్ని నమోదు చేసింది. మహిళల జట్టు విభాగంలోనూ. భారతీయ అమ్మాయిలు అద్భుత విజయం సాధించారు. ఇటలీకి చెందిన మార్సెల్లా టినిలి, ఐరెనె ఫ్రాంచిని, ఎలీసా రోనెర్‌పై వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్నీత్ కౌర్‌తో కూడిన భారత జట్టు.. 236-225 తేడాతో గెలుపొందారు. ప్రత్యర్థి ఆటగాళ్లకు ఏ దశలోనూ అవకాశం ఇవ్వకుండా, మన అమ్మాయిలు చెలరేగి ఆడటంతో.. ఈ విజయం సొంతం అయ్యింది. అటు.. పురుషుల టీమ్ ఈవెంట్‌లో అభిషేక్ వర్మ, ప్రియాన్ష్, ప్రథమేశ్‌తో కూడిన భారత జట్టు నెదర్లాండ్‌కు చెందిన మైక్ స్కాలోసెర్, సిల్ పటెర్, స్టెఫ్ విలిమ్స్ టీమ్‌పై 238-231 తేడాతో గెలుపొంది హ్యాట్రిక్ స్వర్ణ పతకాన్ని ఖాయం చేశారు. మూడు విభాగాల్లో భారత్‌కు మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి. ఇక రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో అంకిత బాకత్- బొమ్మదేవర ధీరజ్ జోడీ మెక్సికోతో తలపడనుండగా.. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్టార్ ఆర్చర్ దీపిక సెమీస్‌కు చేరింది.

ఢిల్లీ పై పైకి..

- ఫ్రేజర్ మెరుపు ఇన్నింగ్స్
- ఉత్కంఠపోరులో ముంబయిపై పది పరుగుల తేడాతో గెలుపు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో మరో ఉత్కంఠ మ్యాచ్ జరిగింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ-ముంబయి జట్ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 257పరుగులు చేయగా.. ఛేదనలో ముంబయి జట్టు 20ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 247పరుగులు చేసింది. దీంతో 10 పరుగుల తేడాతో ఢిల్లీ గెలిచి పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకింది. భారీ ఛేదనలో భాగంగా ముంబయి టాపార్డర్ ఫ్లాప్ షోతో నిరాశపరిచారు. ఖలీల్ అహ్మద్, ముకేశ్ ధాటికి 45 పరుగులకే ఓపెనర్లు ఇషాన్ కిషన్(20), రోహిత్ శర్మ(8)లు పెవిలియన్ చేరారు. ఇంప్యాక్ట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్(26)ను వెనక్కి పంపి ముంబయిని ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే.. తిలక్ వర్మ(63), హార్దిక్ పాండ్యా(44)లు ధనాధన్ ఆడి స్కోర్ బోర్డును పరుగు పెట్టించారు. ఈ జోడీని విడదీసేందుకు పంత్.. కుర్రాడు రసిక్ దార్ సలాంకు బంతి అందించి విజయం సాధించాడు. రసిక్ ఒకే ఓవర్లో పాండ్యా, నేహల్ వధేరా(4)ను ఔట్ చేసి ముంబయిని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ఆ తర్వాత వచ్చిన టిమ్ డేవిడ్(37) అండగా తిలక్ బౌండరీల మోతతో ముంబయిలో గెలుపు దిశగా నడిపారు. 18వ ఓవర్‌లో ముకేశ్ ఎల్బీగా డేవిడ్‌ను వెనక్కి పంపగా.. ఆఖరి ఓవర్లో 25 పరుగులు అవసరం కాగా.. తిలక్ తొలి బంతికే రనౌటయ్యాడు. ల్యూక్ వుడ్(9), పీయూష్ చావ్లా(10)లు చెరొక బౌండరీ బాదారు. ఆఖరి బాల్‌కు చావ్లా ఔటయ్యాడు. ఢిల్లీ బౌలర్లు సలామ్‌కు మూడు, ఖలీల్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫ్రేజర్ (84పరుగులు)

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ × బెంగళూరు
వేదిక: అహ్మదాబాద్; మ.3.30గం॥లకు

చెన్నై × సన్‌రైజర్స్ (వేదిక: చెన్నై; రా.7.30గం॥లకు

థామస్, ఉబెర్ కప్‌లో శుభారంభం

ఛెంగ్డు(చైనా): ప్రతిష్ఠాత్మక థామస్, ఉబెర్ కప్‌లలో భారతజట్లు శుభారంభం చేశాయి. థామస్ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ గ్రూప్-సిలో 4-1తో థాయ్‌లాండ్‌పై, ఉబెర్ కప్‌లో మహిళల జట్టు కెనడాపై 4-1తో గెలిచాయి. పురుషుల సింగిల్స్-1లో ప్రణయ్ 20-22, 14-21తో విదిత్ శరణ్(థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. డబుల్స్‌లో చిరాగ్-సాత్విక్ జంట 21-19, 19-21, 21-12తో సుప్రమ్-తీరరస్టకుల్‌పై గెలిచారు. దీంతో స్కోర్ 1-1తో సమమైంది. లక్ష్యసేన్ 21-12, 19-21, 21-16తో తీరరస్టుకుల్‌పై, పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-ధృవ్ కపిల 21-19, 21-15తో, మూడో సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-9, 21-5తో శరణ్ జస్రీని చిత్తు చేసి భారత్ 4-1తో విజయం సాధించింది.

ఉబెర్‌కప్ గ్రూప్-ఎలో అస్మిత చాలీహ 26-24, 24-22తో స్టార్ షట్లర్ మిచ్చెలిని చిత్తుచేసింది. మహిళల డబుల్స్‌లో ప్రియ-స్మృతి 21-12, 21-10తో, రెండో సింగిల్స్‌లో ఈషారాణి 21-13, 21-12తో వెన్ యును చిత్తుచేసి భారత్‌కు 3-0 ఆధిక్యతలో నిలిపారు. మహిళల రెండో డబుల్స్‌లో సిమ్రన్ సింఘి-రితిక 19-21, 15-21తో ఓడినా.. మూడో, చివరి సింగిల్స్‌లో అన్మోల్ కర్బ్ 21-15, 21-11తో ఎలీనా జంగ్‌పై గెలిచి భారత్‌కు 4-1 ఆధిక్యతను చేకూర్చారు.

ఎదురులేని రాజస్తాన్

లక్నోపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం

లక్నో: ఐపిఎల్ సీజన్-17లో రాజస్తాన్ రాయల్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 196పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు 19 ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలుత లక్నో జట్టు కెప్టెన్ కెఎల్ రాహుల్(76), దీపక్ హుడా(50) అర్ధసెంచరీలతో రాణించారు. రాజస్తాన్ బౌలర్లలో సందీప్ శర్మకు రెండు, బౌల్ట్, ఆవేశ్ ఖాన్, అశ్విన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో రాజస్తాన్ ఓపెనర్లు జైస్వాల్(24), బట్లర్(34) తొలి వికెట్‌కు 5.5 ఓవర్లలో 60పరుగులు జతచేశారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనా.. కెప్టెన్ సంజు(71నాటౌట్; 33బంతుల్లో 7ఫోర్లు, 4సిక్సర్లు), ధృవ్ జురెల్(52నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించారు. రియాన్ పరాగ్(14) నిరాశపరిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు లభించింది.

రాహుల్, హుడా చెలరేగగా..

అంతకుముందు లక్నో సూపర్ జెయింట్స్ పవర్ ప్లేలో రాజస్థాన్ పేసర్లు బౌల్ట్, సందీప్ శర్మ ధాటికి రెండు వికెట్లు పడినా.. కెప్టెన్ కెఎల్ రాహుల్(76), దీపక్ హుడా(50)లు అడ్డ గోడలా నిలబడ్డారు. మూడో వికెట్‌కు 115 పరుగులు జోడించి లక్నోను పటిష్ట స్థితిలో నిలిపారు. చివర్లో ఆయుష్ బదొని(18), కృనాల్ పాండ్యా(15)లు పోరాడడంతో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రాజస్థాన్ పేసర్లలో సందీప్ శర్మకు రెండు వికెట్లు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68